# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

తెలుగు దినపత్రిక

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి   తెలంగాణ - రంగారెడ్డి   సంపుటి : 01   సంచిక : 130 గురువారం , జూన్ 11, 2026 ,   పేజీలు - 12   వెల : 1 /-





## పుష్కర కాలంలో అనేక మార్పులు

# తీసుకుని వచ్చాం



- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ,జూన్ 10 :** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు.

మిగతా2లో...

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే

# బండకేసి కొడతారు

### - టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ

- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్దిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్ 10 :** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని మిగతా2లో...

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

### - పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం



2లో

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

- అక్కడికి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది
- ఉత్తర,దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం
- మీడియాతో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ,జూన్ 10 :** జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం

మిగతా2లో...

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

- 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్ 10 :** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని

మిగతా2లో...

# చట్టం తన పని తాను చేసుకుంటుంది..

## తప్పు చేసిన వారిని వదిలిపెట్టదు

**రాష్ట్ర మంత్రిని ఏకవచనంతో సంబోధించడం సరికాదు**

**పుట్ట మధుకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల మండిపాటు**





**మంథని:** చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం రామగుండంలో పూదరి సత్యనారాయణగౌడ్ అరెస్టు వ్యవహారంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే, సూరయ్య పల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అజీమ్ ఖాన్ పేరవేన లింగయ్య యాదవ్ సేగ్గం రాజేష్ రాకేష్ మాట్లాడుతూ ప్రజాపాలనకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిపైనా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని అన్నారు. చట్టబద్ధంగా పోలీసులు తమ విధులు నిర్వర్తిస్తున్నారని, దానిని రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. పూదరి సత్యనారాయణగౌడ్‌ను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లిన అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, దీనికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లేదా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో మంథని నియోజకవర్గంలో జరిగిన అనేక ఘటనల సందర్భంగా పోలీసులపై విమర్శలు చేయని పుట్ట మధుకర్, ప్రస్తుతం చట్ట ప్రక్రియ కొనసాగుతుండగా పోలీసులను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. పూదరి సత్యనారాయణగౌడ్ అరెస్టు విషయంలో అందుబాటులో ఉన్న ఆధారాల మేరకే పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపారు. మంథని కోర్టులో న్యాయమూర్తి అందుబాటులో లేకపోవడంతో కేసును గోదావరిఖని కోర్టుకు బదిలీ చేసినట్లు తెలిపారు. కేసు పత్రాలు, ఎఫ్ఐఆర్ తదితర అంశాలను సక్రమంగా సమర్పించాలని మాత్రమే న్యాయమూర్తి సూచించారని, కేసును తిరస్కరించినట్లు ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పుట్ట మధుకర్ తనకు అనుకూలంగా ప్రచారం చేసుకోవడం తగదన్నారు. ఒకవైపు భారత రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని, మరోవైపు దుర్భాషలాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులను అవమానించేలా మాట్లాడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఏకవచనంతో సంబోధించడం రాజకీయ సంస్కృతికి మంచిది కాదన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని, ప్రస్తుతం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని పుట్ట మధుకర్‌కు హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, విచారణ పూర్తయ్యే వరకు సంయమనం పాటించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పోలు శివ, యువజన విభాగం మండల అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

### అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్

### మినాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి



**కరీంనగర్,జూన్ 10 :** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం

మిగతా2లో...

# పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు.

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

(మొదటి పేజీ తరువాయి)

జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చా రు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరా బాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016-17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు.

# ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

## - మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జూన్ 10 :** ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజ నాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

**హైదరాబాద్,జూన్ 10 :** మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయ స్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎం సీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశిం చిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు.

## మహనీయుల ఆశయ సాధనకు జ్ఞానచైతన్య రథయాత్రను నాగర కర్నూల్ నియోజకవర్గంలో జెండా ఊపి ప్రారంభించారు

- ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని రథయాత్రను ప్రారంభోత్సవం చేశారు..





**నాగర్ కర్నూల్ భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** మహనీయుల ఆశయాల సాధనతో పాటు రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా చైతన్యం కల్పించడమే జ్ఞాన చైతన్య రథయాత్ర లక్ష్యమని కూచుకుళ్ల రాజేష్ రెడ్డి స్పష్టం చేశారు...మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం ఈ రథయాత్ర ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. యువతలో జ్ఞానం, చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన తెలిపారు...ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెట్టి వెంకటేష్,నాయకులు , సర్పంచ్ లు, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు

## నాగర్ కర్నూలు జిల్లా సాయి గార్డెన్ నందు జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు సమక్షంలో డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం అవగాహన సదస్సు







**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి " 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక " భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ IPS ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో సాయి గార్డెన్ నందు డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ , పిల్లల భద్రత డ్రగ్స్ కి అడ్డుకట్ట అనే విషయం మీద ఈ డ్రగ్స్ రహిత కార్యక్రమం జరిగింది , ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు పిల్లలకు డ్రక్స్ బారిన పడకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదే అని వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని సమాజం పట్ల గౌరవం పెరిగే విధంగా పెంచాలని దిశ నిర్దేశాలు చేయడం జరిగింది ,మీకు డ్రగ్స్ ఎవరైన్ వాడుతున్నట్లు తెలిసిన, డ్రగ్స్ ఎవరైనా అమ్ముతున్నట్టు లేదా రవాణా చేస్తున్నట్లు అలాగే గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలిసిన టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి కాల్ చేసి సమాచారం తలపగలరు , తెలిపిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయని , గ్రామ పట్టణ యువత డ్రగ్స్ రహిత నిర్మూలనలో ముందు వరుసలో ఉండాలని తెలిపారు ,ఈ కార్యక్రమంలో TGNAB డీఎస్పీ బుచ్చయ్య , నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ నాగర్ కర్నూల్ సిఐ అశోక్ రెడ్డి నాగర్కర్నూల్ ఎస్సై గోవర్ధన్ నాగర్ కర్నూల్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్సై రామ్ లాల్ తో పాటు ఆటో డ్రైవర్స్ లారీ డ్రైవర్స్ పాన్ షాప్ ఓనర్స్ మెడికల్ షాప్ ఓనర్స్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## మల్కాజిగిరి నూతన పోలీస్ కమిషనర్ బి. సుమతిని అభినందించిన ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్



**వార్త:హైదరాబాద్, జూన్ 10:** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ గారిని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని అభిలషించారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. ప్రత్యామ్నాయ హెడ్‌లైన్స్:మల్కాజిగిరి సీపీ బి. సుమతికి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ శుభాకాంక్షలు నూతన బాధ్యతలు స్వీకరించిన సీపీని కలిసిన ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతితో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ భేటీ కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని సీపీ బి. సుమతికి ఎమ్మెల్యే ఆకాంక్ష

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలుబిబిఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్..





**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య** నియోజకవర్గంలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, రెండవ విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై ఎంపీడీవోలు మరియు హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అర్హులైన పేద కుటుంబాలు ఏ కారణం చేతనైనా L3 జాబితాలో ఉన్నట్లయితే, వారి అర్హతలను పరిశీలించి L1 జాబితాలోకి మార్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా గుడిసెలు, మిద్దెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి వారికి శాశ్వత గృహాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకే అందజేయబడతాయని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా, నిజమైన అర్హులను గుర్తించి గృహాలు మంజూరు చేసి గుడిసెలు లేని దేవరకొండ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం 226 గుడిసెలు ఉన్నాయని, ఆ కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటివరకు మీరు నిర్మించుకున్న ఇండ్లకు, బేస్ మెంట్ లెవెల్, స్లాబ్ లెవెల్ గోడలు, పూర్తిగా నిర్మాణం కానీ ఇండ్ల దశను బట్టి ఇందిరమ్మ ఇల్లులోకి మార్చుకొని డబ్బులు డబ్బులు మీ ఖాతాలోకి జమ అయ్యేలా చేస్తాం. ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో ఎవరైనా అధికారులు లేదా ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సస్పెన్షన్ చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. మొదటి విడతలో మంజూరైన ఇండ్లలో ఇప్పటివరకు బిల్లులు విడుదల కాకపోయిన వాటికి సంబంధించిన సమస్యలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు బిల్లుల మొత్తాలు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో బస్సు యాత్ర కొన సాగింపు యాత్ర విజయవంతం

- తెలకపల్లి మండల కేంద్రంలో ప్రజా పాలనా ప్రగతి నివేదిక బస్సుయాత్ర
- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం







**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** పార్లమెంట్ పరిధిలో ఎంపీ మల్లురవి చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సుయాత్ర నాగర్ కర్నూల్ నియోజకవర్గంవద్ద ప్రారంభమై నాగర్ కర్నూల్ నియోజకవర్గం లోని తెల్కపల్లి మండల కేంద్రంలో పర్యటించడం జరిగింది. ప్రజా పాలన కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు పై విస్తృత ప్రచారం. పేదలకు సన్నబియ్యం,ఉచిత కరెంట్. ఉచిత బస్సు ప్రయాణం. యింటిగ్రేటెడ్ పాఠశాలలు .ఇందిరమ్మ ఇండ్లు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వికలాంగులకు ట్రై సైకిళ్లు మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లు మహిళలకోసం వడ్డీ లేని రుణాల పెంపు మహిళలకు పెద్ద పీట వేయడం. 75 వేల ఉద్యోగాలు 500 కే గ్యాస్ సిలిండర్ రైతు భరోసా. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి అర్హుడికి వాటి ఫలాలు అందేలా చూసే బాధ్యత ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తపై ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,సర్పంచ్ చంద్రశేఖర్ ,ఉప సర్పంచ్ శ్రీనివాసులు ,మండల్ అధ్యక్షుడు బండ పర్వతాలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళలు, యువత, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి భరోసా ఇది దేవరకొండలో 246 మంది ఆడబిడ్డలకు కళ్యాణ కానుక: రూ.2.46 కోట్ల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య :** పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు భరోసాగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారు మంగళవారం ఘనంగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని అర్హులైన 246 మంది లబ్ధిదారులకు కలిపి మొత్తం రూ. 2,46,28,536 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం ఆర్థిక భారంగా మారకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. "వివాహ ఖర్చులతో ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఇది కేవలం ఆర్థిక సాయం కాదు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రభుత్వం ఇస్తున్న భరోసా" అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలనేదే తమ లక్ష్యమని, అందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. "ఈ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో నిజంగా సంతోషాన్ని నింపుతున్నాయి" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి -- పేదలకు ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సిపిఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా






**రంగారెడ్డి, జూన్ 10, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీపై రేషన్ వస్తువులను అందించాలని,మార్కెట్‌లో నల్లబజారు, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి గృహ సమస్యను పరిష్కరించాలని కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 215 నుండి 225 వరకు ఉన్న భూదాన భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కుటుంబాలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం జనగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులకు విద్యుత్, మంచినీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. చేవెళ్ల మండలం పరిధిలోని సర్వే నెంబర్ 75లో నాలుగు ఎకరాల భూమిలో గత మూడు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేద కుటుంబాలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహేశ్వరం మండలం నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 166లో ప్రభుత్వ భూమికి సంబంధించి 2009 మంది లబ్ధిదారులకు మంజూరైన పట్టాల ప్రకారం భూములపై కబ్జా కల్పించాలని కోరారు. అలాగే కొద్దూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 237లో 2008 సంవత్సరంలో 74 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు పొజిషన్ చూపించలేదని, వెంటనే భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. చౌదరిగూడ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 142లో 142 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసినప్పటికీ భూమిపై హక్కు కల్పించలేదని, వెంటనే పొజిషన్ చూపించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని పాలమాకుల జంగయ్య హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రాచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగరావు, పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, ఓరుగంటి యాదయ్య, ఫైమీద రామకృష్ణ, బుద్ధుల జంగయ్య, సిపిఐ సీనియర్ నాయకులు కాల్వ నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, బాతురాజు నరసింహ, నరసింహారెడ్డి, పల్నాటి యాదయ్య, ఆర్ యాదగిరి, ఎం ఏ రియాజ్, నీలమ్మ, వద్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సుదీర్ఘ ప్రధానమంత్రి పదవీకాలానికి బాలాపూర్‌లో మహాహారతి





- ప్రత్యేక పూజలతో ఘనంగా వేడుకలు
- 4,399 రోజుల ప్రజాసేవ దేశ ప్రజల విశ్వాసానికి నిదర్శనం : కొలను శంకర్ రెడ్డి




**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన** భారతదేశ చరిత్రలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానమంత్రిగా సేవలందిస్తున్న నరేంద్ర మోదీ 4,399 రోజుల సుదీర్ఘ పదవీకాలాన్ని పూర్తి చేసిన సందర్భంగా బాలాపూర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాని మోదీ దీర్ఘాయుష్షు, దేశాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలను శంకర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వం భారతదేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికిందన్నారు. 2026 జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించడం దేశ ప్రజలు ఆయనపై ఉంచిన అపారమైన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. "దేశం ముందుగా" అనే సూత్రంతో మోదీ ప్రభుత్వం గత పన్నెండు సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని తెలిపారు. ఆర్థిక, సామాజిక, సాంకేతిక, అంతర్జాతీయ రంగాల్లో భారత్‌ను మరింత బలోపేతం చేసిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. దేశంలోని పేద ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వామ్యం చేసిన జనధన్ యోజన, డిజిటల్ ఇండియా కార్యక్రమం, యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ద్వారా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన డిజిటల్ విప్లవం, ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది మందికి ఆరోగ్య భద్రత, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంతింటి కలను సాకారం చేయడం, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాల కల్పన వంటి పథకాలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. అదేవిధంగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు, నూతన విద్యా విధానం ప్రవేశపెట్టడం, ఆర్టికల్ 370 రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని మరింత బలోపేతం చేశాయని అన్నారు. స్టార్టప్ ఇండియా ద్వారా యువతలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభించిందని, రైతులు, మహిళలు, పేదల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచడంలో మోదీ నాయకత్వం కీలకమైందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లారని కొనియాడారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధానమంత్రి అంకితభావం,దృఢ సంకల్పం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. భారత మాత సేవలో నిమగ్నమైన నరేంద్ర మోదీకి భగవంతుడు మరింత శక్తిని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించినట్లు కొలను శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్ (మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు), పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డి శ్రీశైలం, జోరల ప్రభాకర్, కల్లెం లక్ష్మారెడ్డి, మునగాల ప్రభాకర్ రెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, పెద్దింటి సుధాకర్, రామిడి శేఖర్ రెడ్డి, రామాచారి సిరికొండ, కల్లెం మురళి రెడ్డి, నర్రె గోపాల్, మంగపతి నాయక్, కొంతం ప్రకాష్ రెడ్డి, క్యారాగరి అరవింద్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం దేశభక్తి నినాదాలు, భారత్ మాతాకీ జై నినాదాలతో మార్మోగగా, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధించాలని నాయకులు ఆకాంక్షించారు. బాలాపూర్ ప్రాంతంలో నిర్వహించిన ఈ వేడుకలు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

# డబుల్ బెడ్రూమ్ పంపిణీలో తవ్వేకొద్దీ లొసుగులు

● రెవెన్యూ డివిజన్ అధికారికి ఫిర్యాదు చేసిన జనసేన నాయకుడు సాయికుమార్ గౌడ్

I shall be grateful for your prompt action in this matter.
Thanking you.
Yours faithfully,
G.SAIKUMAR GOUD
JANASENA PARTY TELANGANA
CELL: +91 9394 594 162
+91 9642 594 162



3. Whether any eligible beneficiaries were left out during the selection process.
4. The details of the officers and staff who conducted the beneficiary survey and verification process.
5. The dates on which the surveys were conducted.
6. The criteria and norms followed while selecting beneficiaries.
7. Action taken against any officials if irregularities are found.

I request you to kindly conduct an enquiry and take necessary action as per rules. I also request that the details of the officers who conducted the survey be furnished to me.

D.NO. 11-1903, SRI LAKSHMI NARASIMHA COLONY, MANGALAGIRI, ANDHRA PRADESH, PINCODE: 522503, INDIA.

**శంకర్పల్లి, జూన్ 9, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం :-** శంకర్పల్లి పురపాలక సంఘం పరిధిలో జరిగిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకంలో భారీ అవకతవకలు జరిగాయని జనసేన పార్టీ నాయకుడు సాయికుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకం గురించి సాయికుమార్ గౌడ్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయడంతో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు స్పందించలేదు. దీంతో అసలు సంగతులు తెలుసుకునే క్రమంలో చేవెళ్ల డివిజన్ మొత్తంలో ఇలాంటి ప్రజా సంక్షేమ పథకాలలో రాజకీయ ఒత్తిడి వల్ల చాలా అవకతవకలు జరిగాయని తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సాయికుమార్ గౌడ్ చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసి సమగ్ర విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా సంక్షేమ పథకాలైన డబుల్ బెడ్రూమ్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వితంతు పెన్షన్, వికలాంగుల పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారుల పూర్తి వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. వీలైనంత త్వరగా ఈ విషయమై విచారణ జరుపుతామని రెవెన్యూ డివిజన్ అధికారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్ గౌడ్ తో పాటు దివాకర్, శ్రీనివాస్, ఆగేష్, తెలుగు సాయి పాల్గొన్నారు.

# తెలకపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారిని నర్మదా ఎమ్మార్వో మరియు ఎస్సై ఆధ్వర్యంలో విత్తన ఎరువుల మరియు పురుగుల మందుల ఇన్స్పెక్షన్స్



**తెలకపల్లి: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** మండలంలోని విత్తన ఎరువులు మరియు పురుగుమందుల దుకాణాలు మండల వ్యవసాయ అధికారి పి.నర్మద,ఎస్సై రమేష్ ఎమ్మార్వో విజయ్ కుమార్ కంబైన్ ఇన్స్పెక్షన్స్ లో భాగంగా దుకాణాల పరిశీలన చేయడం జరిగింది మండలంలోని మన గ్రోమోర్ సెంటర్, మణికంఠ ట్రేడర్స్, బాలకృష్ణ ట్రేడర్స్ సేల్ పాయింట్స్ అదే విధంగా గోదాములను పరిశీలించి ఏరువుల నిల్వలను విత్తన నిల్వలను సరిచూడడం జరిగింది. బాలకృష్ణ ట్రేడర్స్ నందు స్టాక్ రిజిస్టర్స్ ఓపెనింగ్ బ్యాలెన్స్ సరిగా లేకపోవడం వల్ల స్టాప్ సేల్స్ ఇష్యూ చేయడం జరిగింది. రెక్టిఫియబుల్ వయోలేషన్స్ మాత్రమే ఐడెంటిఫై చేయడం జరిగింది. nonrectifiable వయోలేషన్స్ ఏమైనా ఉంటే వారిపై కఠిన చర్యలు, ఉంటాయని, 6ఏ కేసెస్ కూడా చేయబడతాయని తెలియజేశారు. డీలర్స్ అందరూ కూడా వారి లైసెన్స్, స్టాక్ రిజిస్టర్స్,నేమ్ boards, గోడౌన్ ఇంక్లూషన్స్, మరియు ఇన్వాయిస్ కాపీలు, ధృవీకరణ పత్రాలు, ప్రతీ నిల్వలకు కచ్చితంగా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి అని తెలిపారు,

# ఘనంగా భగవత్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ జన్మదిన వేడుకలు



**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన** హైదరాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ వద్ద తన కార్యాలయంలో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మనీ సిద్ధార్థ, రోహిణి కాంత్, జగదీశ్వర్ రెడ్డి, మధుసూదన్, మధు, బంజారా భారత్ తెలంగాణ రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్ కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పెద్దలు నాయకులతో కలిసి ఆయన కు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరిస్తూ పూల బొకే అందజేశారు ఆయనతో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. పెద్దలకు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్దలు స్నేహితులు బంధువులు స్థానిక నాయకులు అభిమానులు నాయకులు చిన్నలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# నూతన నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కృష్ణ కి TGPOA ఆధ్వర్యంలో ఘన సన్మానం

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (TGPOA) ఆధ్వర్యంలో, నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (DM&HO)గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డా.కృష్ణని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేయడం జరిగింది. బిఈ సందర్భంగా జిల్లా ప్రజారోగ్య సేవల అభివృద్ధికి ఆయన నాయకత్వంలో వైద్య, ఆరోగ్య శాఖ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షిస్తూ సంఘ ప్రతినిధులు తమ అభినందనలు తెలియజేశారు. అనంతరం డా. కృష్ణ గారు మాట్లాడుతూ, జిల్లాలో వ్యాక్సిన్ నిల్వలు, అత్యవసర ఔషధాల లభ్యత మరియు పంపిణీ వ్యవస్థపై సమీక్ష నిర్వహించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఈ-ఔషధి (e-Aushadhi) పోర్టల్‌లో ఇండెంట్లను సకాలంలో రూపొందించడం, రోగుల వివరాలు మరియు మందుల




వినియోగ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. రవి కుమార్ నాయక్, డా. తారాసింగ్, డా. సురేష్ బాబు, డా. ప్రదీప్ తదితరులు పాల్గొని నూతన ఐవీడీనూ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో TGPOA జిల్లా అధ్యక్షుడు ఎం. సురేష్, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి డి. కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.కె. వెంకటేష్, డి. బాలరాజు సభ్యులు భగత్ పాల్గొన్నారు.

# చట్టం తన పని తాను చేసుకుంటుంది.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టదు

● రాష్ట్ర మంత్రిని ఏకవచనంతో సంబోధించడం సరికాదు : పుట్ట మధుకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల మండిపాటు



**మంథని, జూన్ 10:** చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని,తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి పెట్టదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. రామగుండంలో పూదరి సత్యనారాయణగౌడ్ అరెస్టు వ్యవహారంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే, సూరయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు తదితరులు మాట్లాడుతూ, ప్రజాపాలనకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిపైనా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని పేర్కొన్నారు. పూదరి సత్యనారాయణగౌడ్‌ను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లిన అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదన్నారు. చట్టబద్ధంగా పోలీసులు తమ విధులు నిర్వర్తిస్తున్నారని, దానిని రాజకీయ రంగు పులమడం తగదని స్పష్టం చేశారు. చట్ట ప్రక్రియకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లేదా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అనేక ఘటనల సమయంలో మౌనంగా ఉన్న పుట్ట మధుకర్, ప్రస్తుతం పోలీసులను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. పూదరి సత్యనారాయణగౌడ్ అరెస్టు విషయంలో అందుబాటులో ఉన్న ఆధారాల మేరకే పోలీసులు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. మంథని కోర్టులో న్యాయమూర్తి అందుబాటులో లేకపోవడంతో కేసును గోదావరిఖని కోర్టుకు బదిలీ చేసినట్లు తెలిపారు. కేసు పత్రాలను సక్రమంగా సమర్పించాలని మాత్రమే న్యాయమూర్తి సూచించారని, కేసు తిరస్కరణపై జరుగుతున్న ప్రచారం వాస్తవ విరుద్ధమని చెప్పారు.




రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఏకవచనంతో సంబోధించడం రాజకీయ సంస్కృతికి మంచిది కాదన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని, విచారణ పూర్తయ్యే వరకు చట్ట ప్రక్రియకు సహకరించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పోలు శివ, యువజన విభాగం మండల అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండలో అదిరిపోయిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ : చిన్నారుల విన్యాసాలకు ఫిదా అయిన అతిథులు

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య** PPR ఫంక్షన్ హాల్ లో JKA SHOTOKAN INDIA అసోసియేషన్ దేవరకొండ కరాటే మాస్టర్ శ్రీను వారిచే RK సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్‌లి ప్రధానోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంకు ముఖ్య అతిదులుగా BRS రాష్ట్ర నాయకులు వద్య రమేష్, స్థానిక గౌ CI వెంకటరెడ్డి, SI రాజు, ఎక్సైజ్ SI నర్సింహా, మాజీ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహా విచ్చేసారు. తెలంగాణ, ఆంధ్ర cheif Examiner రాపోలు సుదర్శన్ వారి సమక్షంలో ఈ యొక్క బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ అద్యంతం చూపారులను ఆకర్శించింది. ఈ సందర్భంగా జ× వెంకటరెడ్డి విద్యార్థుల ఉద్దేశించి కరాటే అనేది ఆత్మ రక్షనే కాకుండా క్రమశిక్షణ, ఏకగ్రత, మానసికస్టర్యం పెంపోందిస్తాయి కానీ నేర్చుకున్న విద్యార్థులు విద్యను తప్పుగా వాడకూడదని చెప్పి విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు బెల్ట్ ప్రధానం చేసారు. దీ=నా నాయకులు వద్య రమేష్ మాట్లాడుతూ కరాటే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి వారు కరాటేలో మెలుకువలు నేర్చుకొని ఈ యొక్క నియోజకవర్గంకు మంచి గుర్తింపు రావాలని కోరుకుంటు కరాటే స్టూడెంట్స్ కు వారి ప్రాక్టీస్ చేసుకోవాడికి కరాటే కిట్స్ కోసం నా నుండి సహాయ సహకారం ఉంటుంది అని తెలియజేశారు, అదే విధంగా నా వంతు సహాయ



సహకారాలు ఎల్లపుడు Rk ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణకు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంకు ముత్యాల రవి, జర్నలిస్ట్ ముసిని అంజన్ మాస్టర్ నాగరాజు ఫౌండేషన్ ఉప అధ్యక్షులు ఎండీ అన్వార్ ప్రధాన కార్యదర్శి పొట్ట విజయ్ కుమార్, ఇరగడిండ్ల రామకృష్ణ, చంద్రకళ,గుండాల వెంకట్, డాన్స్ మాస్టర్ జగన్, కబడ్డీ కోచ్ చరణ్, కొండ ప్రేమ్ కుమార్, సైదులు మాస్టర్ సంధ్య మాస్టర్ వెంకటేష్ మాస్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా పున్న రామకృష్ణ ముఖ్య అతిధులకు, సభ్యులకు తల్లితండ్రులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు




# ఓటరు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే శ్రీగణేష్

● కంటోన్మెంట్‌లో ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలకు అవగాహన సదస్సు

**కంటోన్మెంట్, జూన్ 10 (భవిష్యత్ ప్రజా పాలన న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని క్లాసిక్ గార్డెన్‌లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సుకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, ఎస్ఐఆర్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్ కల్వ సుజాత, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కైలాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎస్ఐఆర్ తేదీలు, దరఖాస్తు విధానం, సాంకేతిక అంశాలు, పాటించాల్సిన



జాగ్రత్తలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఓటర్ల పేర్ల తొలగింపు, అక్రమ చేర్పులు వంటి అవకతవకలు జరగకుండా నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. గతంలో ఇతర రాష్ట్రాల్లో చోటుచేసుకున్న ఓటరు జాబితా వివాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా



ప్రజలు, అధికారులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణానికి అధికారుల అండదండలా..? రోడ్డు ఆక్రమణతో ప్రజలకు నరకయాతన..?








**హైదరాబాద్,బాగ్ లింగంపల్లి, సుందర్య పార్క్,భవిష్యత్ ప్రజాపాలన :-** సుందరయ్య పార్క్ ఎదురుగా రద్దీ ప్రాంతంలో ఎప్పుడూ పార్క్ వచ్చే జనాలతో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతంలో నిబంధనలను తుంగలో తొక్కి బిల్డింగ్ నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భవనం ప్రస్తుతం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.రోడ్డు వెడల్పును పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణం చేపట్టడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా భవనం రహదారికి అత్యంత సమీపంగా నిర్మించబడినట్లు కనిపిస్తోంది.దీంతో ఇప్పటికే ఇరుకుగా ఉన్న వీధి మరింత కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఒకవైపు పార్కింగ్, మరోవైపు నిర్మాణం కారణంగా రహదారి వినియోగానికి అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. ప్రశ్నించాల్సిన విషయం ఏమిటంటే...ఈ నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరయ్యాయి? టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ సమయంలో తనిఖీలు నిర్వహించలేదా? నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు పాటించారా లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం, పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, సంబంధిత జోనల్ కమిషనర్ స్పందించలేదని చెబుతున్నారు.నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి ఉంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ వంటి సేవా వాహనాలు సైతం ఈ ప్రాంతంలో సులభంగా రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే పరిస్థితులు తలెత్తేలోపు అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.”టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, జోనల్ కమిషనర్ వెంటనే విచారణ చేపట్టి నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు, రోడ్డు ఆక్రమణ అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి” అని స్థానికులు కోరుతున్నారు.ప్రజా ప్రయోజనాల కంటే కొందరి ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా? లేక అధికారుల నిర్లక్ష్యమే ఇలాంటి నిర్మాణాలకు కారణమా? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# నాలుగు ప్రధాన న్యూరో శస్త్రచికిత్స విభాగాలకు ఒకే వేదికపై అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలు

- మెడికవర్ హాస్పిటల్స్‌లో న్యూరో ఎండోస్కోపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



**సికింద్రాబాద్, జూన్ 10, (భవిష్యత్ ప్రజా పాలన న్యూస్)**న్యూరో సర్జరీ రంగంలో అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లోని సంగీత్ యూనిట్‌లో లి“సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ”లిని ఘనంగా ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీవో ఛైర్మన్, మాజీ రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి శాఖ కార్యదర్శి, మాజీ రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా సేవలందించిన డాక్టర్ జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ వైద్య నిపుణులు, సీనియర్ అధికారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ నూతన కేంద్రం ద్వారా మెదడు కణితులు (బ్రెయిన్ ట్యూమర్స్), స్కల్ బేస్ డిజార్డర్స్, హైడ్రోసెఫాలస్, వెంట్రిక్యులర్ పాథాలజీస్ వంటి క్లిష్ట న్యూరోలాజికల్ సమస్యలకు అత్యాధునిక న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక హై-డెఫినిషన్ న్యూరో ఎండోస్కోపిక్ పరికరాలు మరియు బహుళ విభాగాల న్యూరోసైన్సెస్ నిపుణుల బృందం సహకారంతో ఈ కేంద్రం పనిచేయనుంది. ఈ కేంద్రానికి ప్రధాన బలంగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ రమేష్ శిగకోళ్లి అనుభవం నిలుస్తుంది. న్యూరో ఎండోస్కోపీ రంగంలో ఆయనకు విశేష నైపుణ్యం ఉండటంతో, పెద్ద కోతలు లేకుండా, చిన్న మార్గాల ద్వారా మెదడు మరియు స్కల్ బేస్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించే అవకాశం రోగులకు లభించనుంది.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ శిగకోళ్లి మాట్లాడుతూ, “న్యూరో ఎండోస్కోపీ కారణంగా క్లిష్టమైన మెదడు వ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. హై-డెఫినిషన్ విజువలైజేషన్ మరియు అత్యంత ఖచ్చితమైన పరికరాల సహాయంతో మెదడులో లోతైన భాగాలను కూడా సురక్షితంగా చేరుకోవడం సాధ్యమవుతోంది. దీంతో శస్త్రచికిత్స సమయంలో గాయాలు తగ్గి, నొప్పి తక్కువగా ఉండి, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచ స్థాయి న్యూరో ఎండోస్కోపిక్ సేవలను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం” అని తెలిపారు.ముఖ్య అతిథి డాక్టర్ జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, “ఇమేజింగ్, నావిగేషన్, ఆప్టిక్స్ మరియు ప్రెసిషన్ టెక్నాలజీలలో వచ్చిన పురోగతి వైద్యరంగాన్ని కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఈ ఆధునిక సాంకేతికతలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో మెడికవర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషి అభినందనీయం. న్యూరోసైన్సెస్ రంగంలో ఈ కేంద్రం రోగులకు మరింత మెరుగైన చికిత్స ఫలితాలను అందిస్తుందని నమ్ముతున్నాను” అని పేర్కొన్నారు. ప్రస్తుతం మెదడు కణితులు, హైడ్రోసెఫాలస్, పిట్యూటరీ ట్యూమర్లు మరియు ఇతర స్కల్ బేస్ వ్యాధులు అధునాతన ఇమేజింగ్ సదుపాయాల వల్ల ప్రారంభ దశలోనే గుర్తించబడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మినిమల్ ఇన్వేసివ్ న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలు రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభంతో మెడికవర్ హాస్పిటల్స్ న్యూరోసైన్సెస్ రంగంలో తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, అత్యాధునిక సాంకేతికత, నిపుణుల సేవలు మరియు సమగ్ర చికిత్సా సదుపాయాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చింది.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా. వికాస్ అగర్వాల్ (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్), డా. శ్రీనివాస్ రావు దూసా (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్), డా. సుధీర్ పెంచాల పుట్టిబోయిన (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్), డా. రోహిత్ రమేష్ వడిఖాయే (కన్సల్టెంట్ న్యూరోసర్జన్)తో పాటు సెంటర్ హెడ్ కృష్ణవేణి పాల్గొన్నారు.

# “బాలల భద్రతే భవిష్యత్‌కు బాట -- అవగాహనతోనే నిర్మూలన”

- ఎల్. వెంకటేశం రాజు

**సికింద్రాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):**న్యూ బోయిగూడ ఇస్లామీయ గర్ల్స్ హైస్కూల్‌లో బాల కార్మిక వ్యవస్థ, చిన్నారులపై వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు న్యూ బోయిగూడలోని ఇస్లామీయ గర్ల్స్ హైస్కూల్‌లో ఆశ్రిత ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ, చిన్నారులపై వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు.చిన్నారులపై ఎలాంటి వేధింపులు, దౌర్జన్యాలు లేదా బాల్య వివాహాల సమాచారం తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా 9154214357 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థినులకు తమ హక్కులు, రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేశం రాజు, సీనియర్ నాయకుడు లంక రాజు, వినయ్ సుంకపాక, కొత్తూరు వెంకటేష్, మహేష్, లీవ్స్ ఆంతోని, రాకేష్, రాము తదితరులు పాల్గొన్నారు.




# ఆమనగల్లు ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త ఊపిరి

- బదిలీల్లో భాగంగా ఐదుగురు వైద్య సిబ్బంది విధుల్లో చేరిక
- మెరుగుపడనున్న వైద్య సేవలు.. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** ఆమనగల్లు ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బదిలీల్లో భాగంగా ఐదుగురు కొత్త వైద్య సిబ్బంది బుధవారం విధుల్లో చేరారు. కొత్త సిబ్బంది రాకతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.విధుల్లో చేరిన వారిలో నర్సింగ్ అధికారిణులు విమల, విజయ, జ్యోతి ఉన్నారు. అలాగే సూపర్‌వైజర్‌గా మరియ రాణి, ఓపీ ఏఎన్ఎంగా దస్తగిరియమ్మ బాధ్యతలు స్వీకరించారు. వీరందరూ ఆరోగ్య కేంద్రంలో హాజరై విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. కొత్త సిబ్బంది చేరికతో రోగులకు వేగవంతమైన వైద్య సేవలు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అందించే సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగనున్నాయని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందిని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ అధికారులు అభినందించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో వారి సేవలు కీలకంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేటితో బస్టాండ్ లో ముగిసిన సత్యసాయి చలివేంద్రం,అంబలి కేంద్రం..

- సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కే.బాలరాజు.



**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లా కేంద్రంలోని భగవన్ శ్రీ సత్యసాయి సేవా సమితి మరియు శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్టు ద్వారా నాగర్ కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్ లో మార్చి 30 నుండి శ్రీ సత్య సాయి చలివేంద్రంలో పంపిణీ చేస్తున్న చల్లని త్రాగునీరు,మజ్జిగతో కూడిన అంబలి కేంద్రం నేటితో ముగిసినట్లు సత్య సాయి సేవ సమితి కన్వీనర్ కే.బాలరాజు తెలిపారు. సత్యసాయి సేవా సమితి, సాయి భక్తులు, సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్, దాతల సహకారంతో ప్రతిరోజు చల్లని త్రాగునీరు, గ్లూకోజ్ వాటర్,మరియు మజ్జిగతో కూడిన అంబలిని ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.సహకరించిన భక్తులకు దాతలకు స్వామివారి కృప కటాక్షాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ కన్వీనర్ హాకీమ్ విశ్వప్రసాద్,కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, సత్యసాయి యువజన, మహిళా,భజన మండలి,సేవాదళ్, వివిధ జోన్ల బాధ్యులు,బాలవికాస్ గురువులు, సాయి భక్తులు, సత్యనారాయణ, పాండురంగారెడ్డి రంగారావు,శెట్టి, బాలకృష్ణ ,రాజు, సువర్ణ,సాయి గీత,శారద, భాస్కర్,సేవాదళ్ మహిళా సేవాదళ్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మామిడి పండ్లు తిని ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి: నారాయణగూడలో దారుణం

**హైదరాబాద్:**నగరంలోని నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మామిడి పండ్లు తిన్న కొద్దిసేపటికే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు.అసలేం జరిగిందంటే? నారాయణగూడకు చెందిన ఒక కుటుంబ సభ్యులు మార్కెట్ నుండి తెచ్చిన మామిడి పండ్లను తిన్నారు. తిన్న కొద్దిసేపటికే కుటుంబంలోని వారందరికీ తీవ్రమైన వాంతులు, విరేచనాలు ప్రారంభమై అస్వస్థతకు గురయ్యారు.దీంతో వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం నాడు అక్క భువనేశ్వరి (17), ఆ తర్వాత రోజు మంగళవారం చెల్లెలు సంధ్య (10) మరణించారు. అదే కుటుంబానికి చెందిన తల్లితో పాటు మరో ఇద్దరు కుమార్తెలు (మొత్తం ముగ్గురు) ప్రస్తుతం ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మామిడి పండ్లను త్వరగా మగ్గబెట్టడానికి వ్యాపారులు వాడే ప్రమాదకరమైన రసాయనాలు కారణమా? లేక మరేదైనా విషపదార్థం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# శేరిగూడ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్




**శంకర్‌పల్లి, జూన్ 10, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం:** శంకర్‌పల్లి మండలం శేరిగూడ గ్రామంలో బుధవారం సర్పంచ్ నివేదిత ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ జరిగింది. ఈ గ్రామ సభకు ముఖ్యఅతిథిగా శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ పాల్గొని ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షాకాల ముందస్తు చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ఓటర్ నమోదు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. గ్రామాలలో పారిశుధ్యం పై అధికారులు, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జి.హెచ్.ఎం.సి కాంట్రాక్టర్ల అసోసియేషన్ తాత్కాలిక కమిటీ ఎన్నిక: చైర్మన్‌గా హన్మంత్ సాగర్ ఏకగ్రీవం



**హైదరాబాద్ :**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన తాత్కాలిక (Ad Hoc) కమిటీ ఘనంగా ఏర్పాటయింది. ఈ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ కాంట్రాక్టర్ హన్మంత్ సాగర్ (అన్న) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ సభ్యులందరూ ఏకాభిప్రాయంతో ఆయనను ఈ పదవికి ఎన్నుకున్నారు.తాత్కాలిక కమిటీ ఏర్పాటు పట్ల అసోసియేషన్ సభ్యులు, తోటి కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన హన్మంత్ సాగర్ అన్నకు పలువురు ప్రముఖులు, అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో అసోసియేషన్ మరింత బలోపేతం అవుతుందని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఈ నూతన కమిటీ అంకితభావంతో పనిచేస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ హన్మంత్ సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

# బౌద్ధనగర్‌లో ఇంటింటి ప్రచారంతో ఎస్ఐఆర్ కార్యక్రమం

● "ఓట్లు తొలగకుండా జాగ్రత్త -- నూతన ఓటర్ల నమోదుకు ఇంటింటి ప్రచారం".



**సికింద్రాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** బౌద్ధనగర్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే భాగంగా మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూసుకోవడంతో పాటు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రాజ్ సుందర్, కంది నారాయణ, బ్రహ్మచారి, మల్లేష్, క్రాంతి తదితరులు పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ప్రజలు తమ ఓటు వివరాలను సరిచూసుకొని, అర్హులైన వారు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

# మోదీ ఆరోగ్యంగా దీర్ఘకాలం దేశానికి సేవలందించాలని ప్రత్యేక పూజలు

● కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల పాలన విజయవంతంగా కొనసాగాలని ప్రార్థనలు



**సికింద్రాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని అరుణ్ జ్యోతి కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీ ఆరోగ్యంగా ఉండి మరెన్నో సంవత్సరాలు దేశానికి సేవలందించాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమం బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేష్, ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కేఎం కృష్ణ, వై. సురేష్, ఎస్. రాజు, వై. శ్రీనివాస్ ముదిరాజ్, ఎ. శ్రీనివాస్, కే. కృష్ణ, ఆర్. సత్యనారాయణ, బి. పరమేష్, లక్ష్మణ్, సల్వరాజ్, కే. ఆండాలు, టి. సురేఖ, శరత్ చంద్ర, టీ. లావణ్య, వెంకటపతి రాజు తదితరులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించిన ర్యాల రాజేందర్ యాదవ్





**సికింద్రాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్)** సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ మెట్టుగూడ ముదిరాజ్ సంఘం భవనం వెనుక ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికుడు స్టాలిన్ ద్వారా డ్రైనేజ్, స్ట్రీట్ లైట్లు, రోడ్ల సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ర్యాల రాజేందర్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాళ్లు పుష్పమ్మ, సుజాత, గంగ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణలో పాల్గొన్న శంకర్‌పల్లి చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్

● 2, 3, 11 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించి వర్షాకాల సన్నద్ధతపై చర్చ










**శంకర్‌పల్లి, జూన్ 10, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 11 వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం సందర్భంగా వార్డు సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, జల సంరక్షణ మన సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవం విజయవంతం చేయడం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ప్రజల భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, వైస్ చైర్మన్ శ్వేత పాండు రంగారెడ్డి, వార్డు కౌన్సిలర్లు సంధ్య రాణి అశోక్ కుమార్, గుండా గిరిజ చంద్రశేఖర్, ఫైముదా బేగం, సమ్మి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి రేవతి, మేనేజర్ అంజన్ కుమార్, వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి

● చేవెళ్ల మున్సిపాలిటీ 7 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు




**చేవెళ్ల, జూన్ 10, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం:** చేవెళ్ల మున్సిపాలిటీ 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం సందర్భంగా వార్డు సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్డు సభలో చేవెళ్ల మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి పాల్గొని వార్డుల అభివృద్ధి, ప్రజల సమస్యలపై ప్రస్తావించారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవం విజయవంతం చేయడం, ప్రజల భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, చేవెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు మధ్యల శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, అత్తెల్లి మనిషా అనంతరెడ్డి, కృష్ణా నాయక్, దేవల్ గారి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, మల్గారి శ్రీకాంత్ రెడ్డి, కవాడి రాజవర్ధన్ రెడ్డి, పిసరి దామోదర్ రెడ్డి, వార్డు ప్రజలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తలసాని ఆదేశాలతో వేగవంతమైన సహాయక చర్యలు

● సజన్ లాల్ స్ట్రీట్‌లో నిలిచిన వర్షపు నీటి తొలగింపు

-- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన





**సికింద్రాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్)** మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలను వేగవంతం చేశారు. మోండా డివిజన్ పరిధిలోని సజన్ లాల్ స్ట్రీట్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి రావడంతో వెంటనే బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్, శానిటేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి మ్యాన్‌హోల్స్‌కు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించి నిలిచిపోయిన నీటిని బయటకు పంపించారు. అలాగే రోడ్లపై పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించే పనులను కూడా చేపట్టారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకిన నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.

# ఐసీ-సేవాక్స్ 2026 తొలి అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక

● డిసెంబర్ 15, 16 తేదీల్లో ఐసీఎఫ్ఐ టెక్‌లో స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధపై సదస్సు













**శంకర్ పల్లి, జూన్ 10, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి రంగయ్య గారి శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం :-** హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఐ టెక్, ఐఎఫ్‌హెచ్ఈ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధ, కమ్యూనికేషన్ వ్యవస్థలపై తొలి అంతర్జాతీయ సదస్సు ఐసీ–సేవాక్స్ 2026ను 2026 డిసెంబర్ 15 మరియు 16 తేదీలలో, ఐసీఎఫ్ఐ టెక్‌కు చెందిన శాస్త్ర సాంకేతిక విభాగ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌హెచ్ఈ హైదరాబాద్ ఉప కులపతి ఆచార్య టి. కోటి రెడ్డి మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ రంగాలలో పరిశోధన, ఆవిష్కరణలు, అంతర్జాతీయ విద్యా సహకారాన్ని ప్రోత్సహించడంలో ఐసీఎఫ్ఐ టెక్ హైదరాబాద్ కట్టుబాటుకు ప్రతీకగా ఐసీ–సేవాక్స్ 2026 నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సు స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, అర్ధవాహక సాంకేతికతలు, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధ, వస్తు అంతర్జాలం, పొందుపరిచిన వ్యవస్థలు, ఆధునిక కమ్యూనికేషన్ వలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, శాస్త్రవేత్తలు తమ నాణ్యమైన పరిశోధనా పత్రాలను సమర్పించి, జ్ఞాన మార్పిడిలో పాల్గొనాలని ఆయన ఆహ్వానించారు. ఈ సదస్సు అంతరశాఖ పరిశోధనలకు, పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యానికి, ఆవిష్కరణల ఆధారిత సాంకేతిక అభివృద్ధికి ప్రపంచ స్థాయిలో విశేషంగా దోహదపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఐసీఎఫ్ఐ టెక్ హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య కె.ఎల్. నారాయణ మాట్లాడుతూ, ఈ సదస్సు నిర్వహణకు ముందడుగు వేసిన ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాన్ని అభినందించారు. స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, అర్ధవాహక సాంకేతికతలు, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధ, వస్తు అంతర్జాలం, పొందుపరిచిన వ్యవస్థలు, కమ్యూనికేషన్ వలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఒక ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, పరిశ్రమల నుంచి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. అలాగే, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ యొక్క సీ2ఎస్ పథకం కింద స్థాపించబడిన అత్యాధునిక అర్ధవాహక తయారీ సౌకర్యం కాన్‌ఫాక్ ప్రయోగశాల, వీఎల్ఎస్ఐ రూపకల్పన కేంద్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సదస్సు యొక్క అంతర్జాతీయ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, ఐసీ–సేవాక్స్ 2026 కన్వీనర్, నిర్వాహక చైర్ డా. అసిసా కుమార్ పనిగ్రాహి మాట్లాడుతూ, ఈ సదస్సు అర్ధవాహక సాంకేతికతలు, వీఎల్ఎస్ఐ రూపకల్పన, పొందుపరిచిన వ్యవస్థలు, వస్తు అంతర్జాలం, కృత్రిమ మేధ, సంకేత ప్రాసెసింగ్, తదుపరి తరం కమ్యూనికేషన్ వలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నిర్వహించబడుతోందని తెలిపారు. ఈ సదస్సు అంశాలు భారత ప్రభుత్వ ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఆధునిక ఎలక్ట్రానిక్స్, చిప్ డిజైన్ రంగాలలోని జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా రూపొందించబడినట్లు పేర్కొన్నారు. పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శించడానికి, భారతదేశాన్ని అర్ధవాహక ఆవిష్కరణలు, మేధోసాంకేతికతలలో ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సహకారాలను పెంపొందించడానికి ఈ సదస్సు ఒక ఉత్తేజకరమైన అంతర్జాతీయ వేదికగా ఉపయోగపడుతురని ఆయన అన్నారు. ఐసీ–సేవాక్స్ 2026 జనరల్ చైర్ డా. కౌశిక్ మిద్యా మాట్లాడుతూ, స్కోపస్ సూచికలో నమోదైన ఏఐపీ సదస్సు ప్రొసీడింగ్స్ ద్వారా ప్రచురణ అవకాశాలు, ఎస్‌సీఐ సూచికలో ఉన్న పత్రికతో కొనసాగుతున్న చర్చలు, పరిశోధనా పత్రాల సమర్పణకు సంబంధించిన ముఖ్యమైన గడువులు, నమోదు వివరాలు, పాల్గొనే విధానాలను వివరించారు. పరిశోధకులు, రచయితలు, పాల్గొనదలచినవారు సదస్సుకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఎసోసియేట్ డీన్ డా. వి. శ్రీలలిత మాట్లాడుతూ, ఐసీఎఫ్ఐ టెక్ హైదరాబాద్‌లో బలమైన పరిశోధనా వాతావరణం, జాతీయ స్థాయిలో నిధులు పొందిన పరిశోధనా ప్రాజెక్టులు, డాక్టరల్ కార్యక్రమాలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇచ్చే సంస్కృతి ఉన్నాయని పేర్కొన్నారు. ఐసీ–సేవాక్స్ 2026 వంటి అంతర్జాతీయ సదస్సులు ప్రపంచవ్యాప్తంగా సహకారాలను పెంపొందించడానికి, జ్ఞాన మార్పిడికి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శించడానికి విలువైన వేదికలుగా నిలుస్తాయని ఆమె తెలిపారు.

# అక్షరాభ్యాసం విషాదాంతం - గోదావరి నదిలో ముగ్గురు సోదరుల దుర్మరణం

**బాసర:** పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, చదువుల తల్లి సరస్వతీ దేవి ఆలయంలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు చంద్రశేఖర్(38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) గోదావరి నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన నిర్మల్ జిల్లా బాసరలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం : వివరాల్లోకి వెళితే కాచిగూడ చప్పల్ బజార్?కు చెందిన ఓ నిరుపేద కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కాలిబాటపై సెల్‌ఫోన్ ఇయర్ ఫోన్లు విక్రయించి రోజువారీగా జీవనం కొనసాగిస్తున్నారు. వీరి కుటుంబానికి చెందిన 8 మంది మంగళవారం సరస్వతి అమ్మవారి దర్శనానికి ఉదయం కాచిగూడ నుంచి రైలులో బయలుదేరి బాసరకు చేరుకున్నారు. అనంతరం గోదావరిలో పుణ్య స్నానాలు చేయడానికి వెళ్లారు. స్నానాలు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో కాలుజారి పడిపోయిన చంద్రశేఖర్?ను కాపాడడానికి వెళ్లి మల్లేశ్, ఆయనను కాపాడడానికి వెళ్లి మరో సోదరుడు రామచందర్ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.వెంటనే సమాచారం



అందుకున్న పోలీసులు, అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించి తరువాత మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఆసుపత్రికి తరలించారు. మృతులలో పెద్ద వారైన చంద్రశేఖర్, రామచందర్‌కు వివా హాలు అయ్యాయి. రామచందర్‌కు ఇద్దరు కుమారులు. అమ్మవారిని దర్శించుకొని పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని కుటుంబ సభ్యులంతా సంతోషంతో కలిసివచ్చారు. అంతలో ఈ విషాదం చోటు చేసుకోవడంతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగి పోయింది.


"హైదరాబాద్‌లోని కాచిగూడకు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు అన్నద మ్ములు చంద్రశేఖర్, రామచందర్ మల్లేశ్‌లు మృతి చెందారు. బాసర అమ్మవారి దగ్గరకు చేరుకుని స్నానాల కోసం గోదావరిలో కాలు జారి పడిపోయి నదిలో గల్లంత య్యారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశాం. పంచనామా ప్రక్రియ అనంతరం వారి కుటుంబసభ్యులకు అందిస్తాం" -దీపక్, బాసర సీఐరెండేళ్ల క్రితమే భార్య మృతి : రెండేళ్ల క్రితమే ఇంటిపెద్ద నాగభూషణం భార్య క్యాన్సర్‌తో మరణించింది. ఆ ఘటన నుంచి ఇంకా బయటపడక ముందే వృద్ధాప్యంలో అండగా ఉంటారనుకున్న ముగ్గురు కుమారులు గోదావరిలో మునిగి మృత్యుఒడిలోకి వెళ్లడంతో ఆ తండ్రి బాధ వర్ణనాతీతం అయ్యింది. ఇప్పుడు తన మనవళ్ల భారం పెద్దాయన నాగభూషణం మీదే పడింది. ఇప్పుడు తమకు ఎవరు దిక్కని వాపోయారు. మృతులది నిరుపేద కుటుంబం కావడంతో బాసరకు చెందిన యువకులు వారికి అండగా నిలిచారు. మృతదేహాలను హైదరా బాద్‌కు తరలించేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వం చాటుకు న్నారు.' 'గోదావరిలో స్నానం చేయడానికి నా కుమారులు వెళ్లారు. ఒకరు మునుగుతుంటే కాపాడటానికి మరొకరు వెళ్లారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. చిన్న కుమారుడికి మాత్రం ఇంకా కాలేదు. ఇప్పుడు నా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు" -నాగభూషణం, మృతి చెందిన వారి తండ్రిప్రమాదాలు జరగకుండా : గోదావరి నదిలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది జూన్ 14న హైదరాబాద్‌కు చెందిన 20 ఏళ్లలోపు ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు విడిచారు. ఇందులోనూ ముగ్గురు అన్నదమ్ములు ఉండటం మరీ బాధాకరమైన విషయం. ఇవేకాకుండా తరచూ బాసర వద్ద ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడే అధికార యంత్రాంగం హడావుడి చేస్తుంది తప్ప పునరావృతం కాకుండా పకడ్బందీగా తగిన ఏర్పాట్లు చేపట్టడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికేనా ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ కుట్ర



**హైదరాబాద్, జూన్ 10:** మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు. బీఎన్ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ.. ఎన్నికలను వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఈసీని అడ్డం పెట్టుకొని బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్నారు.మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లకు అవకాశం ఉందని.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెడుతోందని ప్రశ్నించారు. ముందు నుంచే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ చూసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయం గురించి దేశ ప్రజలకు తెలియాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ఎప్పటికీ అధికారంలోకి రారని చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

## సింగరేణి సుస్థిర మైనింగ్‌లో మరో మైలురాయి



**హైదరాబాద్ :** సుస్థిర మైనింగ్ విధానాలు, పర్యావరణ పరి రక్షణలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమి టెడ్() మరో అరుదైన మైలురాయిని సాధించింది. మూసివేసిన డోర్లీ-2 భూగర్భ గనిని ఆదర్శవంతంగా పునరుద్ధరించి, పర్యావరణ ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించినం దుకు కేంద్రం.. ఆ సంస్థకు రూ.40 కోట్ల ఎస్క్రో డిపాజిట్ సొమ్మును వడ్డీతో సహా తిరిగి చెల్లించింది. పర్యావరణ ప్రమాణాల అమలుపై సింగరేణిని ప్రశంసిస్తూ.. కేంద్ర కోల్ కం ట్రోలర్ ఆర్గనైజేషన్ నుంచి సదరు నిధులను విడుదల చేసింది.గని మూసివేతలో పర్యావరణ నిబంధనలను పూర్తిగా అమలు చేసిన సింగరేణి.. బొగ్గు తవ్వకాలు పూర్తైన తర్వాత ఆ భూములను మళ్లీ పచ్చని అడవులుగా మార్చడంపై ప్రత్యేక దృష్టి సారించింది. డోర్లీ గని ప్రాంతంలో దాదాపు 162 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో దట్టమైన అడవులను పునరుద్ధరించింది. తవ్వకాలు ప్రారంభించే ముందు సేకరించిన దాదాపు 19.76 లక్షల క్యూబిక్ మీటర్ల సారవంతమైన మట్టిని భద్రపరిచి, తిరిగి మొక్కల పెంపకానికి వినియోగించింది. గనుల్లో డ్రిల్లింగ్ సమయంలో దుమ్ము, ధూళి చేరకుండా డస్ట్ కంట్రోలర్లు, తడి డ్రిల్లింగ్ పద్ధతులు అనుసరించేలా చర్యలు చేపట్టింది. రవాణా మార్గాల్లో వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లుతూ కాలుష్యాన్ని అదుపులో ఉంచేందుకు యత్నించింది.ఇలా సింగరేణి.. పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించినందుకు గానూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ డోర్లీ-2 ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ పరిరక్షణ డిపాజిట్‌ను విడుదల చేసింది. గతంలోనూ ఆర్కే-8 గనికి రూ.4 కోట్ల డిపాజిట్ కూడా తిరిగి పొందిన ఈ సంస్థ.. త్వరలో డోర్లీ-1 గనికి సంబంధించి మరో రూ.60 కోట్లకు పైగా నిధులను పొందే అవకాశముంది.

# జీ+3 అనుమతులు... జీ+5 పైగా నిర్మాణాలు! చిత్రపురి పరిసరాల్లో అక్రమ కట్టడాలపై ప్రశ్నార్థకం

- **అధికారుల నిర్లక్ష్యమేనా? భవిష్యత్తులో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం**

**హైదరాబాద్, జూన్ 10 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** చిత్రపురి కాలనీ దిగువనున్న సాయి వైభవ్ లేఔట్ ప్రాంతంలో నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారుల నుంచి గ్రౌండ్ ప్లస్ మూడు అంతస్తుల (జీ+3) నిర్మాణానికే అనుమతులు ఉన్నప్పటికీ, పలువురు యజమానులు జీం5 లేదా అంతకంటే ఎక్కువ అంతస్తులతో భవనాలను నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.భవన నిర్మాణ నిబంధనల ప్రకారం అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధం. నిర్మాణ సామర్థ్యం, పునాది బలం, పార్కింగ్ సదుపాయాలు, అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిర్మాణ అనుమతులు జారీ చేస్తారు. అయితే అనుమతులకు మించి అంతస్తులు నిర్మించడం వల్ల భవిష్యత్తులో భవనాల భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా భూకంపాలు, భారీ వర్షాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో భవనాలు ప్రమాదకరంగా మారే




అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. అదనపు అంతస్తుల వల్ల రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి, పార్కింగ్ సమస్యలు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలపై అదనపు భారం పడే ప్రమాదం కూడా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చట్టపరమైన అంశాలు

**మంజూరైన బిల్డింగ్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధం.** పట్టణాభివృద్ధి మరియు మున్సిపల్ నిర్మాణ నిబంధనల ప్రకారం అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులను తొలగించే అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది.ప్రజా భద్రతకు ముప్పుగా మారే అక్రమ నిర్మాణాలపై జరిమానాలు, నోటీసులు జారీ చేయడంతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉంది.ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న కో లివింగ్ హాస్టల్స్.. రేవంత్ సర్కార్‌కు వీహెచ్ కీలక సూచన

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే



స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వీహెచ్ చేసిన సూచనపై ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నెటిజన్లు సూచిస్తున్నారు.ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఓ కో లివింగ్ హాస్టల్‌పై నుంచి ఒక యువతి దూకి ప్రాణాలు తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రియుడి వేధింపులను తట్టుకోలేని ప్రియురాలు.. అదే కో లివింగ్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండే యువతీ యువకులు చేసే పనులతో పరిసరాల్లో ఉండే నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదు



**ఆదిలాబాద్, జూన్ 10 :** పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. (బుధవారం) ఆదిలాబాద్ జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోషం గ్రామసభలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు.దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో.. 1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి




**రామగిరి, జూన్ 10 :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపిందని, ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు, కార్మికులు, ప్రజలు మండుటెండలను సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేశారు.

# ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్.. డ్రగ్స్ డాన్ నీతూబాయి పరారీ

**హైదరాబాద్, జూన్ 10:** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపే ందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీ సుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూ బాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి



విక్రయాలు జరుగుతు న్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడ మే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూ బాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతం లో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది.గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాం గూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతం లో తన అడ్డాను ఏర్పాటు చేసుకున్న నీతూబా యి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజా యి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడు ల్లో గుర్తించారునిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు.

# ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై వారానికి ఐదు రోజులే పనిదినాలు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా సామర్థ్యాన్ని సమన్వయం చేసే దిశగా త్రిపుర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్య మంత్రి డాక్టర్ మాణిక్ సాహా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల పని వేళల్లో మార్పులు చేస్తూ, అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించింది. ఉద్యోగుల పని, వ్యక్తిగత జీవిత సమతుల్యతను మెరుగుపర చడంతో పాటు ప్రభుత్వ సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.పని వేళల్లో మార్పులుప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నాయి. తాజా ఉత్తర్వుల ప్రకారం ఇకపై కార్యాలయాలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తాయి. దీంతో రోజువారీ పని సమయం పెరుగుతున్నప్పటికీ, వారానికి అదనపు సెలవు లభించనుంది. ఇప్పటివరకు రెండో, నాలుగో శనివారాలు మాత్రమే సెలవులుగా ఉండగా, కొత్త విధానంలో అన్ని శనివారాలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలుగా ప్రకటించారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల నాలుగు శనివారాలు లభించనున్నాయి.పరిపాలనకు భంగం ఉండదన్న ప్రభుత్వంశనివారాలు పూర్తిగా సెలవుగా ప్రకటించడం వల్ల ప్రభుత్వ పనితీరుపై ప్రభావం పడకుండా వారంలో మిగిలిన ఐదు రోజుల పని గంటలను పెంచినట్లు అధికారులు తెలిపారు. అదనపు పని గంటల ద్వారా శనివారం సెలవును భర్తీ చేయగలమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పుతో ప్రజలకు అందించే సేవలు, పరిపాలనా నిర్ణయాలు, ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు సమర్థవంతమైన పరిపాలన కొనసాగించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.స్వాగతించిన ఉద్యోగులురాష్ట్ర సివిల్ సెక్రటేరియట్‌కు చెందిన సీనియర్ అధికారి దులాల్ దేవ్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి పని సమయాలు అమల్లో ఉన్నాయని, త్రిపుర ఉద్యోగులు కూడా ఈ విధానానికి త్వరగా అలవాటు పడతారని ఆయన అభిప్రాయపడ్డారు. కొంతమంది ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రారంభ రోజుల్లో స్వల్ప ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కొద్ది రోజుల్లోనే అందరూ కొత్త విధానానికి అలవాటు పడతారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు దేశవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా జీతభత్యాలు ఆశిస్తున్నప్పుడు, అదే స్థాయిలో విధులు నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే అవకాశాన్ని కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. వ్యక్తిగత అభివృద్ధి, విశ్రాంతి, మానసిక ఆరోగ్యానికి ఇది చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారాంతంలో వరుసగా రెండు రోజులు విశ్రాంతి తీసుకునే అవకాశం పొందడం వల్ల ఉద్యోగ సంతృప్తి పెరగడంతో పాటు కార్యా లయాల్లో ఉత్పాదకత కూడా మెరుగుపడే అవకాశముందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.త్రిపుర అటవీ శాఖలో పనిచేస్తున్న డాక్టర్ క్వీన్ శర్మ కూడా ఈ నిర్ణయాన్ని ప్రశంసించారు. గతంలో పని సమయాలు, వ్యక్తిగత కార్యక్రమాలను సమన్వయం చేసుకోవడం కష్టంగా ఉండేదని, తాజా మార్పులతో ఉద్యోగులపై సానుకూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి నెల అదనంగా నాలుగు సెలవులు లభించడం ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచుతుందని, ఇది మంచి పరిపాలనా ప్రణాళికగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమానికి అద్దం పడుతుందని ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి మాణిక్ సాహా ప్రభుత్వం చేపడుతున్న పరిపాలనా సంస్కరణల్లో ఇది మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వస్తున్న సానుకూల స్పందనను దృష్టిలో ఉంచుకుంటే, ఈ కొత్త పని విధానం భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రధాని పదవిలో చరిత్ర సృష్టించిన మోదీ



**న్యూఢిల్లీ:** భారత ప్రధానిగా సుదీర్ఘకాలం పాటు పదవిలో కొనసాగుతూ చరిత్ర సృష్టించినందుకు నరేంద్ర మోదీ ని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బుధవారంనాడిక్కడ జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ప్రధానమంత్రిని అభినందిస్తూ మంత్రులంతా లేచి నిలబడి చప్పట్లతో 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చారు. ప్రధానమంత్రి 4,399 రోజుల సుదీర్ఘ పాలన అభినందనీయమని కొనియాడారు. తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 4,398 రోజులు పదవిలో కొనసాగారు. ఆ రికార్డును ప్రధానమంత్రి మోదీ నేటితో అధిగమించారు.ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అదిపెద్ద పరీక్ష అని ప్రధానమంత్రి మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసినప్పుడే ఎవరైనా ప్రజా విశ్వాసాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ, విదేశీ ప్రముఖులు పలువురు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ 12 ఏళ్ల పాలనను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రశంసించారు. వలస పాలకుల హయాంలో ఏర్పడిన న్యూనతను సమర్థవంతం గా ప్రస్తుత ప్రభుత్వం అధిగమించిందంటూ అభినందించారు. కోట్లాది మంది ప్రజలు ప్రేమ, నమ్మకం, ప్రజాదరణతో సుదీర్ఘ పాలన అందించిన క్రెడిట్ ప్రధానమంత్రి మోదికి దక్కుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. సాధికారక, అభ్యుదయం, అభివృద్ధి, స్వయం సమృద్ధి భారత్ నిర్మాణంలో మోదీ 4,399 రోజుల ప్రయాణం ఒక సువర్ణాధ్యాయమని అన్నారు. మోదీ 12 ఏళ్ల సుదీర్ఘ పాలన ముగించుకున్న విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రులు ప్రధాన్, మన్సుక్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# పీఓకేలో ఉద్రిక్తత.. కశ్మీర్‌లో జోజిలా సంబరాలు



**కశ్మీర్ :** కశ్మీర్ ప్రాంతాల్లో లైన్ ఆఫ్ కంట్రోల్(ఎల్ఓసీ)కి ఇరువైపులా ఒకే సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు భిన్న వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. ఓవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో నిరసనలు, ఉద్రిక్తతలు, భద్రతా బలగాల కాల్పులతో పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో జోజిలా సొరంగం నిర్మాణంలో కీలక మైలురాయి సాధించడంతో అభివృద్ధి సంబరాలు కనిపిస్తున్నాయి.పీఓకేలో ఉద్రిక్తతలు.. రావలకోట్, ముజఫరాబాద్, మీర్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల నిరసనలు ఉధృతమయ్యాయి. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరకుల ధరలు, ద్రవ్యోల్బణం, పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. దీంతో పలుచోట్ల ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం సహా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో 30 మందికి పైగా మృతిచెందినట్టు, సుమారు 200 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. దీంతో గిల్గిట్–బాల్టిస్థాన్ ప్రాంతాల్లోనూ అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్నాయి.జోజిలా సంబరాలు. .ఇక.. జమ్మూకశ్మీర్‌లోని సోనమార్గ్, బాల్తాల్, మినామార్గ్ ప్రాంతాల్లో జోజిలా సొరంగ నిర్మాణం కీలక దశను చేరుకుంది. కశ్మీర్, లద్దాఖ్ వైపుల నుంచి తవ్విన మార్గాలు కలవడంతో ఇంజినీర్లు, కార్మికులు విజయోత్సాహం నిర్వహించారు. సుమారు 13.15 కిలోమీటర్ల పొడవుతో నిర్మితమైన ఈ టన్నెల్.. ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ రహదారి సొరంగాల్లో ఒకటి. సముద్రమట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాది పొడవునా కశ్మీర్–లద్దాఖ్ మధ్య అనుసంధానానికి సాధ్యం కానుంది. ప్రస్తుతం.. శీతాకాలంలో భారీ మంచు కారణంగా జోజిలా కొన్ని నెలలపాటు మూతపడుతుంది. కానీ టన్నెల్ అందుబాటులోకి రానుండటంతో లద్దాఖ్‌కు రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది.

# మోదీ సర్కార్‌ఏ12 ఏళ్లు- నెహ్రూ రికార్డ్ బ్రేక్- అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా ఘనత

**న్యూఢిల్లీ:** భారత రాజకీయ చరిత్రలో జూన్ 10 ప్రత్యేకమైన రోజుగా నిలిచింది. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకుంది. అంతేకాకుండా, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న ఒక కీలక రికార్డును కూడా అధిగమించింది. ఎన్నికల ద్వారా ప్రజల మద్దతుతో వరుసగా ప్రధానిగా అత్యధిక కాలం కొనసాగిన నాయకుడిగా మోదీ కొత్త చరిత్ర సృష్టించారు. 2014 మే 26న తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ, 2019లో రెండోసారి, 2024లో మూడోసారి ప్రజల తీర్పుతో అధికారంలోకి వచ్చారు. దీంతో భారత ప్రజాస్వామ్య చరిత్రలో వరుసగా మూడు సార్లు అధికారంలో కొనసాగుతున్న అత్యంత ప్రభావశీల నాయకులలో ఒకరిగా ఆయన నిలిచారు.నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీస్వతంత్ర భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి 1964 వరకు కొనసాగారు. ఎన్నికైన ప్రధానిగా ఆయన వరుస పదవీకాలం 4,398 రోజులు. నరేంద్ర మోదీ 2014 మే 26 నుంచి కొనసాగుతున్నారు. జూన్ 10తో ఆయన ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుని నెహ్రూ రికార్డును అధిగమించారు. దీంతో ప్రజల ఓట్లతో ఎన్నికై వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా మోదీ పేరు చరిత్రలో నమోదైంది. ప్రజల మద్దతుతో వరుసగా మూడు ఎన్నికల్లో విజయాలు సాధించడం కూడా ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలిచింది. ఇక ఎన్నికైన ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం కొనసాగిన నాయకుల జాబితాలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజుల పాటు ప్రధానిగా సేవలందించారు.12 ఏళ్లలో దేశంలో మార్పులుమోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం పలు రంగాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జీఎస్?టీ అమలు, ప్రత్యక్ష లబ్ధి బదిలీలు, రైల్వేలు, జాతీయ రహదారుల విస్తరణ వంటి కార్యక్రమాలు దేశ అభివృద్ధి దిశను ప్రభావితం చేశాయి. అంతరిక్ష రంగంలో భారత విజయాలు, సెమీకండక్టర్ తయారీపై దృష్టి, తయారీ రంగానికి ప్రోత్సాహం, స్టార్టప్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు కూడా ఈ కాలంలో ప్రధానంగా నిలిచాయి. విదేశాంగ విధానంలో భారత్‌కు అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రాధాన్యం లభించిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది.రాష్ట్ర ముఖ్యమంత్రిగా మొదలై ప్రధాని వరకునరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణం గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైంది. 2001 నుంచి 2014 వరకు ఆయన గుజరాత్ సీఎంగా పనిచేశారు. అనంతరం దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. సీఎంగా, పీఎంగా కలిపి ఆయన ప్రభుత్వాధినేతగా కొనసాగిన కాలం ఇప్పటికే పలు రికార్డులను అధిగమించింది. సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న సుదీర్ఘకాల పాలన రికార్డును కూడా ఈ ఏడాది మోదీ అధిగమించారు. దీంతో ఎన్నికైన ప్రభుత్వాధినేతగా అత్యధిక కాలం బాధ్యతలు నిర్వహించిన నాయకుడిగా ఆయన మరో ప్రత్యేక గుర్తింపును సంపాదించారు.భారత రాజకీయాల్లో కొత్త అధ్యాయం12 ఏళ్ల మోదీ పాలన పూర్తవడం, నెహ్రూ రికార్డును అధిగమించడం భారత రాజకీయ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. స్వతంత్ర భారతంలో కాంగ్రెస్ ఆధిపత్యం నుంచి బీజేపీ కేంద్ర రాజకీయాల్లో ప్రధాన శక్తిగా ఎదిగిన పరిణామానికి ఇది ప్రతీకగా కనిపిస్తోంది. ప్రజల మద్దతుతో వరుసగా మూడు సార్లు కేంద్రంలో అధికారంలో కొనసాగడం, ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం సేవలందించడం వంటి ఘనతలు మోదీ రాజకీయ ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఈ మైలురాయి భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నమోదుకానుంది.



# మమతకు మరో ఎదురుదెబ్బ: రాజ్యసభ సభ్యత్వానికి సుష్మితాదేవ్ రాజీనామా



**బంగాల్ :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్రమైన తిరుగుబాటును ఎదు ర్కొంటున్న బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుఖేందు శేఖర్ బాటలోనే బుధవారం మరో రాజ్యసభ ఎంపీ సుష్మితాదేవ్ రాజీనామా చేయడంతో పార్టీ మరింత సంక్షోభంలో పడింది. తన రాజీ నామాను రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్ కు సమర్పించారు. మమతాబెనర్జీ, అభిషేక్ బెనర్జీ దిల్లీలో ఇండియా కూటమి నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తున్న వేళ ఈ పరిణామం జరిగింది. రాజీనామా నిర్ణయానికి ముందు అసోం సీఎం హిమంత బిశ్వశర్మతో సుష్మితాదేవ్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.సుష్మితా తన రాజీనామా లేఖలో ఈ విధంగా పేర్కొన్నారు. "నేను రాజ్యసభ సభ్యత్వానికి రాజీ నామా చేస్తున్నాను. దీనిని తక్షణమే ఆమోదించవలసిందిగా కోరుతున్నాను. రాజ్యసభ సభ్యురాలిగా నా పదవీకాలంలో నాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్, రాజ్యసభ సచివాలయ అధికారులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు రాసుకొచ్చారు.చేరనుందాకాగా రాజీనామా చేసే ముందు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సుష్మితా క్షమాపణలు చెప్పినట్లు జాతీయ మీడియా తెలిపింది. టీఎంసీ నుంచి గానీ, కాంగ్రెస్ నుంచి గానీ ఇక అసోం రాజకీయాల్లో తాను కొనసాగలేనని మమతాకు ఆమె వివరించినట్లు సమాచారం. అయితే ఆమె బీజేపీలో చేరిన తర్వాత రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. టీఎంసీలోకి చేరడానికి ముందు సుష్మితాదేవ్ కాంగ్రెస్‌లో ఉండేవారు. ఆమె తండ్రి, దివంగత సంతోశ్ మోహన్ దేవ్, యూపీఏ–1 ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. టీఎంసీలో చీలికలు ఇదిలా ఉండగా, జూన్ 8న రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ పార్లమెంటు ఎగువ సభ సభ్యత్వానికి, అలాగే టీఎంసీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామాలో, ఇటీవల ముగిసిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం పాలైనందుకు రాయ్ ఆ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ '15 ఏళ్ల అరాచక పాలన ఫలితమే ఈ తీర్పు' అని ఆయన అభివర్ణించారు. సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు చేయడంతో టీఎంసీలో చీలిక ఏర్పడిందనే ఊహాగానాల మధ్య ఈ వరుస రాజీనామాలు జరిగాయి.మరోవైపు, 20 మంది ఎంపీల వర్గం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్ల కోసం లోక్‌సభ స్పీకర్‌ను అభ్యర్థించినట్లు రెబెల్ టీఎంసీ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ పేర్కొన్నారు. "ప్రత్యేక సీటింగ్ కేటాయించాలని 20 మంది ఎంపీలు కలిసి స్పీకర్‌ను అభ్యర్థించాం.

## ప్రమాదవశాత్తు పేలిన గ్రెనేడ్.. ఇద్దరు భారత జవాన్‌లు దుర్మరణం.



**కశ్మీర్:** ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలిన ఘటనలో ఇద్దరు భారత జవాన్లు దుర్మరణం పాలయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్లోగల కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అధికారిక వర్గాల కథనం ప్రకారం.. శిబిరంలోని సైనికులు ఆయుధ పరికరాలను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తున్న సమయంలో గ్రెనేడ్ అకస్మాత్తుగా పేలింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, వారు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటన పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిందని, ఇందులో ఉగ్రవాదుల ప్రమేయం కానీ, ఇతర బాహ్య శక్తుల పాత్రకానీ లేదని రక్షణ శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ దురదృష్టకర సంఘటనపై సైన్యం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు అత్యంత అరుదుగా జరుగుతాయని, ఆయుధాల వినియోగంలో అప్రమత్తత ఎంతటి కీలకమో ఈ ఉదంతం గుర్తుచేస్తోందని అధికారులు పేర్కొన్నారు. మృతి చెందిన సైనికుల కుటుంబాలకు ఆర్మీ ఉన్నతాధికారులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నిబంధనల ప్రకారం బాధిత కుటుంబాలకు అందాల్సిన అన్ని రకాల ఆర్థిక సాయాన్ని, ఇతర ప్రయోజనాలను సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రక్షణ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

## అమెరికా నేవీకి చెందిన ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఇరాన్ దాడి



**టెహ్రాన్:** అమెరికా దళాలపై ఇరాన్‌విరుచకుపడింది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా దళాలకు చెందిన ఎయిర్‌బేస్‌పై క్షిపణి దాడి చేసింది ఇరాన్. అయితే ఈ దాడి గురించి జోర్డాన్ కానీ, అమెరికా కానీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. మువాఫక్ సాల్టీ ఎయిర్ బేస్‌పైకి క్షిపణులతో దాడి చేసినట్లు ఇరానీ పారామిలిటరీ రెవల్యూషనర్ గార్డులు పేర్కొన్నారు. ఈ ఎయిర్‌బేస్‌లో అమెరికాకు చెందిన ఎఫ్–35 యుద్ధ విమానాలతో పాటు ఇతర విమానాలు ఉన్నాయి. హోర్ముజ్ వద్ద మంగళవారం అమెరికాకు చెందిన ఆర్మీ అపాచీ హెలికాప్టర్ కూలిన విషయం తెలిసందే. ఆ ఘటన నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగింది. దీంతో ఆ దాడుల్ని తిప్పికొట్టేందుకు ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. బుధవారం అమెరికా మిలిటరీ వైమానిక దాడులకు పాల్పడింది. అయితే ఇరాన్ కౌంటర్ దాడికి దిగింది. దీంతో బహ్రెయిన్ కూడా దాడి జరిగినట్లు తెలుస్తోంద. ఆ ద్వీపంలో అమెరికా నౌకాదళానికి చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ బస చేస్తోంది. అయితే ఆ నౌకాదళంపై ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఇరాన్ పేర్కొన్నది.

# మీనాక్షి కేసులో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఏఐసీసీ తెలంగాణ దూత మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు అభ్యర్థి మీనాక్షి నటరాజన్.. బుధవారం ఈసీఐ అధికారుల్ని కలిశారు. ఆ బృందంలో అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేశ్, భూపేశ్ భగల్, దీపా దాస్‌మున్సీ, రణదీప్ సుర్జేవాలా ఉన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కోర్టు కేసు ఉన్న కారణంగా ఆమె రాజ్యసభ నామినేషన్ పిటీషన్‌ను తిరస్కరిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.అయితే దీనిపై కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ స్పందిస్తూ.. ఓ ప్రైవేటు ఫిర్యాదుపై మీనాక్షికి కోర్టు నోటీసు వచ్చిందని, కానీ ఆమెపై ఎటువంటి కోర్టు కేసు లేదన్నారు. తప్పుడు పద్ధతిలో మీ నాక్షి రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించి నట్లు ఆరోపించారు. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫిర్యాదును కోర్టు పరిగణలోకి తీసుకోలేని కారణంగా , ఆమె పై ఎటువంటి కేసు పెండింగ్‌లో లేదని కాంగ్రెస్ నేతలు చెప్పారు. రిట్నరింగ్ ఆఫీసర్ నిర్ణయం చాలా పేలవంగా ఉందని, ఏకపక్షంగా కూడా ఉన్నట్లు సింఘ్వీ ఆరోపించారు.మీనాక్షీపై కేసు !మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ ప్రజలు నికార్సైన గాంధేయవాదిగానే చూశారు. ఆమెపై క్రిమినల్ కేసులు ఉన్నాయనే ఆలోచన కూడా జనాలకు తెలియదు. 2025లో ఆమెపై క్రిమినల్ కేసుకు సంబంధించిన వ్యవహారం నడుస్తున్నట్టు తెలుస్తున్నదని, అంటే పక్కాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆమెపై కేసు నడుస్తున్నది.తన ప్రభుత్వంలో తనపైనే నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు ఆమె వద్దే లేవు. కానీ ఎక్కడో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలకు మీనాక్షి కేసు వివరాలు చేరాయి.



Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# కార్మికులకు జగన్ క్షమాపణ చెప్పాలి




**అమరావతి:** విశాఖ ఉక్కు కర్మాగారం విషయ ంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రజలు పోరాడిన చరిత్రను గుర్తు చేస్తూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రెండుసార్లు కాపాడిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బలోపేతం చేయడానికి కృషి చేసిన తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వైసీపీ తన గత వైఖరిని గుర్తు చేసుకోవాలని లోకేష్ సూచించారు. రాజధాని నిర్మాణం పేరుతో స్టీల్ ప్లాంట్ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జగన్ ప్రభుత్వ హయాంలో జరిగాయని ఆయన ఆరోపించారు.స్టీల్ ప్లాంట్ కాలుష్యం పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందని వ్యాఖ్యా నించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో బాధితులను పరామర్శిం చడం తప్పు కాదని, అయితే ఆ సందర్భాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. స్టీల్ ప్లాంట్ లేకుండా చేయాలని కుట్ర పన్నిన జగన్ అదే విశాఖలో కార్మికులకు క్షమాపణ చె ప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనలో 9కి చేరిన మృతుల సంఖ్య - రూ.1.72 కోట్ల వరకు పరిహారం



**విశాఖ :** విశాఖ ఉక్కు కర్మాగారంలో ఈ నెల 8వ తేదీన జరిగిన ఘోర ప్రమాదంలో మం ొకరు మృతి చెందడంతో మృతుల సంఖ్య 9కు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పైడిరాజు బుధవారం ఉదయం చికిత్స పొం దుతూ కన్నుమూశారని అధికారులు వెల్లడ ించారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో స్టీల్ ప్లాంట్‌లో సలసల మరుగుతున్న ఉక్కు ద్రవం ఒక్కసారిగా లావాలా ఎగసిపడి విధుల్లో ఉన్న కార్మికులపై పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని ఆసుపత్రులకు తరలించారు. వారిలో పైడిరాజును సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమిం చడంతో చికిత్స ఫలించక మృతి చెందారు. పరిహారం ప్రకటించిన ప్రభుత్వం : ఈ దుర్ఘ టనపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాధిత కుటుం బాలకు ఆర్థిక సహాయం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు వెల్లడించింది. ఘటనపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మృతిచెందిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు వేతన, బీమా తదితర ప్రయోజనాలు కలుపుకుని సుమారు రూ.1.72 కోట్ల వరకు ఆర్థిక ప్రయోజనాలు అందు తాయని తెలిపారు. ఒప్పంద ఉద్యోగుల కుటుం బాలకు రూ.45 లక్షల పరిహారం చెల్లించ నున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణా లపై విచారణ కొనసాగుతోందని, బాధ్యు లపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.రంగంలోకి దిగిన త్రిసభ్య కమిటీ : మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై కేంద్ర ఉక్కుశాఖ నియమించిన త్రిసభ్య కమిటీ రంగంలోకి దిగింది. విశాఖకు బొకారో నుంచి కమిటీ సభ్యులు వచ్చారు. బొకారో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ ప్రియారంజన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలో సెయిల్ సీజీఎం జితేంద్రకుమార్?తో పాటు మాజీ సీజీఎం గోపాల్ సింగ్ కూడా సభ్యులుగా ఉన్నారు. కమిటీ సభ్యులతో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ భేటీ అయ్యారు. ప్రమాదానికి గల కారణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించారు. కమిటీ నివేదిక ఆధారంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు చేపట్టనున్నారు.ఒకటి కాదు రెండు ప్రమాదాలు : విశాఖ స్టీల్? ప్లాంట్?లో సోమవారం ఒక ప్రమాదం కాదు. రెండు ప్రమాదాలు జరిగినట్లు తేలింది. స్టీల్ మెల్ట్ షాప్‌లో ఘోర ప్రమాదం జరగడానికి ముందే ఎస్?ఎంఎస్?-2 లోనూ దుర్ఘటన జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం 3 గంటల 57 నిమిషాలకు లాడిల్‌లో పేలుడు సంభవించి సుమారు 60 టన్నుల ఉక్కు ద్రవం ఒలికిపోయింది.క్రేన్‌తో ఎత్తే సమయంలో బ్లాస్టింగ్ : సెకండరీ మెటలర్జీకి కన్వర్టర్ నుంచి లాడర్ వచ్చేటప్పుడు కార్ నిలిపి క్రేన్‌తో పైకి ఎత్తే సమయంలో ఈ బ్లాస్టింగ్ జరిగినట్లు గుర్తించారు. ఆ సమయంలో శాశ్వత ఉద్యోగు లు నలుగురు, ఇద్దరు ఇన్‌ఛార్జులు, 10 మంది కళాసీలు మొత్తం 16 మంది ఉన్నారు. వారు క్షేమంగా ఈ ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు. ప్రమాదం గురించి సమాచారం అందు కున్న తోటి ఉద్యోగులు విధుల్లో ఉన్నవారికి సంప్రదించగా, వారి యోగక్షేమాలు చెబుతూ "మృత్యుంజయులం" అంటూ వాట్సప్ గ్రూప్‌ల లో మెసేజ్‌లు కూడా పెట్టారు. ఇది జరిగిన కొద్దిసేపటికే 4 గంటల 25 నిమిషాలకు ఎస్?ఎంఎస్?-1లో భారీ పేలుడు సంభవించి 8 మంది అక్కడికక్కడే మరణించారు.

# అక్రమార్కుల చెరలో పట్టాభి రామయ్య భూమి - విడిపించాలని కోరుతున్న స్థానికులు



**విజయవాడ :**ఎకరా 96 సెంట్లు భూమి, ధర రూ. 40 కోట్ల పైమాటే. ఇదీ విజయవాడ మల్లికార్జున పేటలోని పట్టాభి రామస్వామి వారి మాన్యం వివరాలు. అంత ఆస్తి ఉన్నప్పటికీ ధూపదీప నైవేద్యాల కోసం పట్టాభి రామయ్య దుర్గమ్మ మీద ఆధారపడాల్సి వస్తోంది. అందుకు కారణం దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం. పట్టాభి రామస్వామి భూమిని అక్రమార్కులు కబ్జా చేసి ఏళ్లు గడుస్తున్నా సరే అధికారులు వాటిని అక్రమార్కుల చెర నుంచి విడిపించలేదు. భూమిని రక్షించండి మహాప్రభో అంటూ సామాన్యులు మొత్తుకుంటున్నా వ్యవహ రిస్తున్నారు.పట్టాభి రామస్వామి ఆలయం విజ యవాడ ఇంద్రకీలాద్రి కొండపైనే మల్లికార్జున పేటలో ఉంది. కనకదుర్గమ్మ ఉప ఆలయంగా ఉన్న ఆలయానికి గొల్లపూడి బైపాస్ రోడ్డుకు సమీపంలో ఆర్?ఎస్ నెంబర్ 528/3లో 1.96 ఎకరాల భూమి ఉంది. 1946లో పినిశెట్టి వెంక మ్మ ఈ భూమిని దేవాలయానికి రాసిచ్చారు. భూమి విలువ ప్రస్తుతం రూ. 40 కోట్లపైనే ఉంది. దేవాదాయ శాఖకు చెందిన 43(10) సహా అన్ని రికార్డుల్లోనూ ఆలయం పేరుతోనే భూమి ఉంది. భూమిని గతంలో కౌలుకు ఇచ్చారు. ఆ తర్వాత దానిపై దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీన్ని అదునుగా చేసుకున్న ఆరుగురు అక్రమార్కులు రెవెన్యూ అధికారుల సహాయంతో అడంగల్‌లో చేయించేసుకున్నారు.ఆరుగురి పేర్లపైన రిజిస్ట్రేషన్లు: గొల్లపూడి రీ సర్వే నెంబర్ 528/3 లోని ఈ భూమిని ఫసలీ నెంబర్ 1402, 1407, 1413లో మాన్యువల్ అడంగల్, వెబ్ అడంగల్‌లో అక్రమార్కులు తమ పేర్లపైకి మార్చేసుకున్నారు. ఫసలీ నెంబర్ల మేరకు 1992, 1997, 2003లో కబ్జాకు తెరలేపినట్లు తెలుస్తోంది. తర్వాత 2011లో ఆరుగురి పేర్లపైకి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూ కబ్జాకు రికార్డులు మార్చడానికి 2011లో ప్రైవేటు వ్యక్తుల పేరుపైకి రిజిస్ట్రేషన్లు చేయ డానికి సహకరించిన తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, సర్వేయర్ల పేర్లు ఇవ్వాలని తాజాగా సామాజిక కార్యకర్త గగ్గర కృష్ణారావు సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా సరే ఫలితం లేకుండా పోయింది. అధికారుల పేర్లు ఇవ్వకుండా కేవలం మాన్యువల్ అడంగల్, వెబ్ ల్యాండ్ అడంగల్‌లో ఎప్పుడు మార్చారనేదే తెలిపారు. ఈ అక్రమానికి వెన్నుదన్నుగా ఉన్నవారిని కాపాడాలనే ప్రయత్నం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆలయ నిర్వహణ, ధూపదీప నైవేద్యాలకు దుర్గ గుడి నుంచి ఏటా లక్ష రూపాయలు ఇస్తున్నారు. అక్రమార్కుల చెర నుంచి భూమిని విడిపిస్తే ఆ పరిస్థితి ఉండదని స్థానికులు అంటున్నారు. భూ కబ్జా విషయం తెలిసినా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపిస్తు న్నారు."ఈ పట్టాభిరామ స్వామి దేవాలయానికి 1946లో పినిశెట్టి వెంకమ్మ ఆర్?ఎస్ నెంబర్ 528/3లో 1.96 ఎకరాల భూమిని రాసిచ్చారు. భూమి విలువ ప్రస్తుతం రూ. 40 కోట్లపైనే ఉంది. దేవాదాయ శాఖకు చెందిన అన్ని రికార్డుల్లోనూ ఆలయం పేరుతోనే భూమి ఉంది. కొంతమంది వ్యక్తులు అక్రమంగా వీలునామాలు రాయించుకుని ఈ భూమిని కబ్జా చేశారు. ప్రభుత్వం దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగాల కోరుతున్నాం"-జనస్వామి సుబ్రమణ్యం, పట్టాభి రామస్వామి ఆలయ అర్చకులు"మాన్యువల్ అడంగల్, వెబ్ అడంగల్‌లో అక్రమార్కులు తమ పేర్లపైకి మార్చేసుకున్నారు. 2011లో ఆరుగురి పేర్లపైకి రిజిస్ట్రేషన్లు చేయించుకు న్నారు. భూ కబ్జాకు రికార్డులు మార్చడానికి 2011లో ప్రైవేటు వ్యక్తుల పేరుపైకి రిజిస్ట్రేషన్లు చేయడానికి తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, సర్వేయర్ల సహకరించారు. అందుకు గాను సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా ఫలితం లేకుండా పోయింది. అధికారుల పేర్లు ఇవ్వకుండా కేవలం మాన్యువల్ అడంగల్, వెబ్ ల్యాండ్ అడంగల్‌లో ఎప్పుడు మార్చారనేదే తెలిపారు. ఈ అక్రమానికి కొద్దిమంది సహకారాన్ని అందిస్తున్నారు. దీనిపై అధికారులు త్వరితగతిన స్పందించి న్యాయం చేకూర్చాలని వేడుకుంటున్నాం"-

# వాహనాల తనిఖీ, పోలీసులపై గంజాయి ముఠా రాళ్లదాడి



**అల్లూరి జిల్లా :**అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లర్ల పై పోలీసుల కాల్పు లు కలకలం సృష్టించింది. ఒడిశా నుంచి చింత పల్లి మండలం లోతు గడ్డ మీదుగా వెళుతున్న గంజాయి ముఠా వాహనాలను పోలీసులు తని ఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గంజాయ్ స్మగ్లర్లు రాళ్లతో పోలీసులపై దాడులకు ప్రయ త్నం చేశారు. దాంతో హెడ్ కానిస్టేబుల్ తప్పిం చుకున్నారు. నిందితులు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని దాడికి యత్నిస్తుండగా ఎస్సై సాయిరాం గాల్లో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు.దాంతో స్మగ్లర్లు వాహనాలు వదిలి పారిపోతుండగా పోలీసులు వెంటపడి అదుపులో తీసుకున్నారు. మొత్తం 209 కిలోల గంజాయితోపాటు ఓ కారు, రెండు బైక్?లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజస్థాన్, ఛత్తీస్?గఢ్, ఒడిశా, ఆంధ్రకు చెందిన ముఠా ఉంది. ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా గంజాయ్ తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ సాయిరాం ఈ సందర్భ ంగా వెల్లడించారు. చింతపల్లి మండలం అన్నవరం స్టేషన్ పరిధిలో లోతుగడ్డ సమీపంలో ముందస్తు సమాచారంతో పోలీసు అధికారులు తనిఖీలను నిర్వహిస్తున్నారు. పోలీసులపై గంజాయి ముఠా రాళ్ల దాడి: 1బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న కారును తనిఖీ చేస్తున్న క్రమంలో గం జాయి ముఠా పోలీసులపై రాళ్లతో దాడి చేసి ంది. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ కాలర్ కాల ర్ పట్టుకున్నారు. అప్రమత్తమైన ఎస్సై గాలిలోకి కాల్పులు జరపడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారు. వారు పరారవుతుండగా నలుగురు నిందిత ులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జగన్‌కు కుట్రలే తప్ప అభివృద్ధి పట్టదు



**అమరావతి, జూన్ 10:**ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజ లకు జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టంచేశారు. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు. జగన్ విచ్చలవిడిగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా అభివృద్ధి చేశామని, కుట్రలు, కుతంత్రాలు చేయడం తప్ప జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి అస్సలు పట్టదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపిం చారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయి లోకి తీసుకెళ్లి ప్రజలందరికీ వివరించ బోతున్నామని సందర్భంగా తెలియజేశారు.

# మాతృభూమిపై గౌరవం.. దేశానికే జీవితం అంకితం.. మోదీపై పవన్ ప్రశంసలు



**అమరావతి, జూన్ 10:** దేశ సేవలో ప్రధాని మోదీ 4,399 రోజుల పాలన పూర్తి అయ్యిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. మోదీ సేవలను కొనియాడారు. 'మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం' అని అన్నారు. దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోదీ, ఎన్డీఏ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, ఆధునికీకరణ దిశగా భారత సాయుధ దళాలకు కొత్త శక్తి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు కీలక స్థానం లభించిందని, జీ-20 సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లిందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు.డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రజలకు సేవలు చేరువయ్యాయని పవన్ అన్నారు. జనధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం) అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని చెప్పారు. యూపీఐ, డీబీటీ వ్యవస్థలతో డిజిటల్ చెల్లింపులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద కోట్ల మందికి వైద్య భరోసా లభిస్తోం దన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల కల సాకారమవుతోందని పవన్ ప్రస్తావించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు సదుపాయం కల్పించారన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల్లో భారీ అభివృద్ధి సాధించారని చెప్పారు. వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం మొదలై ందని అన్నారు.ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం అభినం దనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్ 2047 సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామ్యం వహిస్తుందన్నారు. భిన్నత్వమే భారతదేశ బలమని, భాషలు భారత గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. జై హింద్.. జై భారత్ అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మరావతికి కేంద్రం వరాలు.. రూ.2534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్.



**అమరావతి:**ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాజధాని అమరావతికి కీలక ప్రాజెక్టులను ప్రకటించింది. రూ. 2,534 కోట్లతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్, జీపీఆర్ఏ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి నిర్మా ణం కోసం సీపీడబ్ల్యూడీ కేంద్ర మంత్రివర్గానికి ప్రతిపాదనలు పంపగా.. బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో ఇందుకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా రూ.1,299.08 కోట్లతో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కాంప్లెక్స్, రూ.1,234.91 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నివాస సముదాయం (జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ కాంప్లెక్స్) నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయా లు అన్నీ కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ భవ నంలో కొలువుదీరనున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం మల్టీస్టోరేజ్ నివాసా లు నిర్మించనున్నారు.మరోవైపు అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టు కోసం 22.53 ఎకరాలను సీఆర్‌డీఏ ఇప్పటికే కేటాయించింది. 5.53 ఎకరాల్లో కామన్ సెంట్రల్ సెక్రటేరి యట్, 17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయం నిర్మించేందుకు ప్రణాళి కలు రచిస్తున్నారు. వీటి నిర్మాణానికి సంబంధి ంచి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తి అయ్యింది. మరోవైపు అమరావతిలో ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ అద్దె భవ నాల్లో నడుస్తుండగా సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం పూర్తి అయితే ఇవన్నీ కూడా సెక్రటే రియట్ కాంప్లెక్స్ భవనంలోకి మారనున్నాయి. సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టును పర్యావరణ హితంగా. గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మిం చనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. అత్యాధునిక మౌలిక సదు పాయాలు, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, కాన్ఫరెన్స్ హాల్స్ , పార్కింగ్ సౌకర్యాలు కల్పించనున్నారు.. మొత్తంగా సెంట్రల్ సెక్రటేరియట్ భవనం రాజధాని అమరావతికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ప్రభుత్వ విభాగాలు అన్నీ ఒకేచోటకు చేరటం ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, అన్ని సేవలూ కూడా ప్రజలకు ఒకే చోట లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదం లభించటంతో ఇప్పుడు ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరగనుంది.

# యోగా మన జీవితంలో భాగం కావాలి



**ఎన్టీఆర్ జిల్లా, జూన్ 10:** ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద 'యోగాంధ్ర'లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా పాల్గొన్నారు. జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 21న జరిగే యోగాంధ్ర విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. యోగా మన జీవితంలో భాగం కావాలన్నారు. ఒత్తిడి, షుగర్, గుండెపోటు నియంత్రణకు యోగా అవసరమని తెలిపారు. భారతీయ సంస్కృతికి యోగా ప్రతీక అని, శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' థీమ్‌తో ప్రభుత్వ కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.జూన్ 21న అమరావతిలో భారీ యోగా వేడుకలకు సీఎం చంద్రబాబు నాయకత్వం వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధాని మోదీ యోగాను ప్రపంచానికి పరిచయం చేశారని.. ప్రతి ఇంట్లో రోజూ అరగంట యోగా చేయాలని సూచించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యువత చెడు అలవాట్లు వీడి యోగాను అలవర్చుకోవాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వసంత కృష్ణప్రసాద్ సూచించారు.

# 370 రద్దుతో ..నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహార్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్య్రం వచ్చిన



తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

# అంటరాని పార్టీ అన్న ముసుగును తొలగించుకున్న బిజెపి

**బిజెపిని ప్రజలకు చేరువ చేయడంలో మోడీ విజయం**

**ప్రాంతీయ పార్టీల నేతలు మోడీతో దోస్తీకి రెడీ**

**విజయం సాధించడమే లక్ష్యంగా మోడీ ఎత్తులు**

**ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేలా కార్యక్రమాలు**

**న్యూఢిల్లీ,జూన్10:** బిజెపి అంటే ఒకప్పుడు అంటరాని పార్టీ. బీజేపీ అంటే బ్రాహ్మణుల పార్టీ అనే భావన. కానీ ఇప్పుడా భావన లేదు. బిజెపి సిద్ధాంతాలను పూర్తిగా మార్చేసిన ఘనత మోడీదే. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బీజేపీలో చేరాలంటే ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాలనే నిబంధనలకు నీళ్లొదిలారు. ఎవరైనా చేరొచ్చని, బీజేపీ కూడా మిగతా పార్టీల్లాంటిదేనని లిబరల్ లుక్ ఇచ్చారు. బీజేపీ అంటే పెద్దగా ఆసక్తి లేనివాళ్లు, అసలు రాజకీయాలపై ఇంట్రస్ట్ లేని వాళ్లు కూడా మోడీని చూసి పార్టీలో చేరుతున్నారని బీజేపీ నేతలే ఒప్పుకుంటున్న పరిస్థితి. ఆ స్థాయిలో బీజేపీలో మోడీ హవా నడుస్తోంది. వరుస ఎన్నికల్లో విజయాలు ఆయనకు ఆషామాషీగా రాలేదు. అవినీతి కనిపించని పాలన, జనాన్ని ఆకట్టుకునే ప్రసంగాలు, ప్రత్యర్థుల్ని ఆశ్చర్యపరిచే వ్యూహాలు.. ఇలా మోడీ అమ్ముల పొదిలో చాలా అస్త్రాలున్నాయి. దేశంలో కాంగ్రెస్ ధాటికి తట్టుకోలేక ప్రాంతీయ పార్టీల ప్రాపకం కోసం చూస్తున్న బీజేపీకి.. మోడీ ఆశాకిరణంలా దొరికారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి అన్ని పార్టీలూ అర్రులు చాస్తున్నాయంటే.. దానికి మోడీ మ్యాజిక్కే కారణం.కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా బీజేపీలో ఎదిగిన మోడీ.. ఇప్పుడు పార్టీలో సర్వంసహా ఆధిపత్యాన్ని సంపాదించారు. మరే నేతకూ సాధ్యం కాని రీతిలో కొంతవరకు వ్యక్తిపూజ సంస్కృతిని కూడా తీసుకొచ్చారు. పార్టీ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. దేశంలో రాజకీయం చేయడం ఒక ఎత్తైతే.. ఎన్నికల రాజకీయం మరో ఎత్తు. చాలా మంది నేతలకు ఈ సూక్ష్మం తెలియకే రాజకీయ తెరపై కొంతకాలం వెలిగి తెరమరుగైపోతున్నారు. కానీ మోడీ మాత్రం ఎన్నికల రాజకీయాన్ని పూర్తిస్థాయిలో ఔపోసన పట్టారు. అసలు ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండగ అని ప్రకటించిన తొలి అగ్రనేత మోడీనే అంటే అతిశయోక్తి కానే కాదు. మిగతా నేతల్లా ఎన్నికలప్పుడే వాటి గురించి ఆలోచించే నేత కాదు మోడీ. అనుక్షణం ఎన్నికల చుట్టే ఆయన ఆలోచనలు తిరుగుతాయి. ప్రధానిగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే చాలనుకునే వ్యక్తి కూడా కాదు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం దక్కింది కొన్నాళ్లు రిలాక్స్ అవుదాం అని కూడా మోడీ ఆలోచించరు. ఎప్పటికప్పుడు జరుగుతున్న ఎన్నికల గురించే కాకుండా.. జరగబోయే ఎన్నికల గురించి కూడా ఆలోచించటం ఆయన నైజం.




అంతకుముందు ఎన్నికలొస్తే చాలు అన్ని పార్టీల మాదిరే బీజేపీ కూడా టెన్షన్ పడేది. పైస్థాయి నేతలకు తగ్గట్టుగానే కిందిస్థాయిలో కార్యకర్తలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉండేవారు. కానీ మోడీ వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఎన్నికలు వస్తే బీజేపీ మరింత ఉత్సాహంగా పనిచేస్తోంది. పై స్థాయి నుంచి కిందిస్థాయి సరికొత్త వ్యూహరచన కనిపిస్తోంది. దీనికి మోడీ ఇచ్చిన స్ఫూర్తే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎన్నికల్ని పండగలా సెలబ్రేట్ చేసుకుని.. ప్రజల ఆశీర్వాదం తీసుకునే అద్భుత అవకాశంగా చూడాలనే మోడీ సరికొత్త థియరీ..

ఎన్నికల విషయంలో బీజేపీ దృక్పథాన్నే మొత్తంగా మార్చేసింది. అప్పటి నుంచి ఆ పార్టీకి ఎప్పుడూ ఊహించని ఫలితాలు చాలా అలవోకగా వస్తున్నాయి. కొన్నిసార్లు బీజేపీ సాధిస్తున్న ఫలితాల్ని చూసి.. ప్రత్యర్థులు కూడా ఏదో జరిగిందని అనుమానించే పరిస్థితి. కొందరు ప్రత్యర్థులు బీజేపీ గెలుపు సూత్రాల్ని కొంతవరకు అర్థం చేసుకున్నా.. ఇంతవరకూ ఎవరూ పూర్తిస్థాయిలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయారు. ఎన్నికల విషయంలో మోడీ పనితీరు, ఆలోచన పద్ధతి ఎలా ఉంటుందో చెప్పటానికి ఆయన సుదీర్ఘ రాజకీయాన్ని పరిశీలించాల్సిన పని లేదు. గత రెండేళ్ల కాలంలో ఆయన వ్యవహారశైలి చూస్తే సరిపోతుంది. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీకి విసుగు లేదు. అలుపు రాదు. తాను ప్రచారం చేసే రాష్ట్రంలో బీజేపీ గెలుపు అవకాశాలు, పార్టీ అస్తి త్వం.. ఇవేవీ ఆయనసలు పట్టించుకోరు. ఏ రాష్ట్రంలో అయినా.. ఏ ప్రాంతంలో అయినా బీజేపీ జెండా ఎగిరేలా చేయటానికి తనకు చేతనైనంత పని చేయాలనే ఏకైక లక్ష్యంతో మోడీ పనిచేస్తారు. ఎన్నికల ప్రచారం అంటే మూస పద్ధతుల్లో కాకుండా.. రాష్టాన్ని బట్టి.. అక్కడి ప్రజల ఆలోచన తీరును బట్టి.. శైలి మార్చుకోవాలని ఆయన సూచిస్తారు. స్వయంగా పాటిస్తారు కూడా. బీజేపీ ఎంత ప్రచారం చేసినా.. దక్షిణాదిలో అనుకున్న ఫలితాలు రావడం లేదన్న ఆ పార్టీ నేతల మాటల్ని ఆయన లైట్ తీస్కుంటారు. గెలిచేదాకా ప్రచారం చేస్తూనే ఉండాలంటారు. ఆ పట్టుదలతోనే గతంలో బీజేపీ గెలవని ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లో గెలిచిందనేది మోడీ నమ్మకం. ఇప్పటివరకూ కాషాయ పార్టీ ఖాతా తెరవని రాష్ట్రాల్లోనూ ఇదే సూత్రం అమలుచేయాలనేది మోడీ వ్యూహం. ఇక్కడ కేవలం వ్యూహరచన చేయటమే కాదు.. ఆ వ్యూహాన్ని కచ్చితంగా అమలు చేయడంలోనూ ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయరు. మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న మోడీ.. ఆ రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూనే.. వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్‌లోనూ ప్రచారానికి వెళ్లారు. అలా చూసు కుంటే.. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీ అందరి కంటే ముందుం టారని చెప్పాలి. మోడీ ఎన్నికల ప్రచారం కూడా భిన్నంగానే ఉంటుంది. తన ప్రచారా నికి ఎంత ఫలితం వచ్చిందో.. తనకు తానుగా బేరీజు వేసుకుంటారు. పార్టీలో తనను అడిగేవారు ఎవరూ లేకపోయినా.. ఆత్మసాక్షికి సమాధానం చెప్పుకునేలా పనిచేయాలనుకుంటారు మోడీ. ఈ చిత్తశుద్ధితో ప్రచారం చేస్తారు కాబట్టి.. మోడీ రోడ్‌షోలు, సభలు.. చాలావరకు విజయవంత మౌతాయి.

# ప్రతిపక్ష బాధ లేని నెహ్రూ





**న్యూఢిల్లీ,జూన్10:** స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోడీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951–52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించిన నెహ్రూకు ఆ కాలంలో పెద్దగా జాతీయ స్థాయి ప్రతిపక్షం ఎదురుకాలేదు. ఆయన సెక్యులర్ ఐక్యత సిద్దాంతంతో దేశాన్ని నడిపించారు.

# యువజన గళం




ఒకవైపు ఉద్యోగాలు లేవు. మరోవైపు ఉన్నత విద్యకు ద్వారాలుగా భావించే పరీక్షలకు భద్రత లేదు. లక్షలాది మంది యువతకు భవిష్యత్తు లేదు. మరి నిరుద్యోగులు ఏం చేయాలి నీట్ వంటి పరీక్షలు లీకేజీలకు బలవుతుంటే, సంవత్సరాల శ్రమతో సిద్ధమైన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, బాధ్యత వహించాల్సిన పాలకులు తప్పించుకుంటుంటే విద్యార్థి యువత ఇంకేం చేస్తుంది వారికీ ఆగ్రహం, ఆవేదన ఉంటాయి. వాటికి ప్రతిబింబమే మొన్న ఢిల్లీ 'జంతర్ మంతర్' వద్ద వినిపించిన నిరసన స్వరం. వేలాది మంది విద్యార్థులు, యువకులు, పాల్గొని నినదించడం సాధారణ పరిణామం కాదు, ఎన్నో ఏండ్ల నుంచి వారిలో దాగున్న నిరాశ, నిస్పృహలకు సంకేతం. ప్రధాని నరేంద్ర మోడీ 2014 ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ లెక్కన ఇప్పటి వరకు ఇరవై నాలుగు కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలి. మరి ఇచ్చారా లేదన్న సంగతి యువత నినా దంలోనే తెలుస్తోంది. పిఎల్ఎఫ్ఎస్ అధికారిక గణాంకాలు నిరుద్యోగిత రేటు 3.1శాతం మాత్రమే ఉన్నట్టు చెబుతున్నా, అదే నివేదికలో పదిహేను నుంచి ఇరవై ఏళ్ల యువతది 9.9శాతంగా ఉందని పేర్కొంది.కానీ స్వతంత్ర సర్వేలు అధికారిక సంఖ్య కంటే దాదాపు రెండింతలు ఎక్కువే ఉంటుందని చెప్పాయి. కనీసం వాస్తవాల్ని కూడా అంగీకరించని పాలన మనది. నిరుద్యోగం సామాజిక సమస్యగా మారడానికి కేంద్రమే కారణం. లక్షలాది ఖాళీలు పేరుకుపోయాయి. వాటిని భర్తీ చేయకపోగా 'మిర్చీలు, పకోడీలు' అమ్ముకోవడం కూడా ఒక ఉద్యోగమేనని సెలవిచ్చారు మన పాలకులు. వారిని నమ్మి ఓటేసినందుకు మిర్చీలు, పకోడీలు అమ్ముకుంటూ బతకాలా ఇప్పటికే మోడీ పాలనలో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి, కార్మికులు రోడ్డున పడ్డారు. వారి కుటుంబాల పరిస్థితేమిటి దేశ అభివృద్ధికి, తమ భవిష్యత్తుకు యువత విద్యనే ఆయుధంగా భావించింది. నీట్, జేఈఈ, యూపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతోంది. కానీ ఒక పరీక్ష లీక్ అయితే వారి భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతోంది. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్ష రద్దయి మళ్లీ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కమీషన్ దొబ్బుతూనే విమర్శలా..?

**• సునీల్ గవాస్కర్ ఆగ్రహం**



ఐపీఎల్ టోర్నీపై విమర్శలు గుప్పిస్తున్న విదేశీ మాజీ క్రికెటర్లు, క్రికెట్ బోర్డులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీసీఐ నుంచి 10 శాతం కమీషన్ దొబ్బుతూనే టోర్నీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తమ ప్రయోజనాల కోసం భారత క్రికెట్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఆయన హితవు పలికారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పూర్తి స్థాయిలో ఆడిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ కంటే ఐపీఎల్ వంటి లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు మాజీ క్రికెటర్లు ఆర్చర్‌పై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ టోర్నీని తప్పుబట్టారు.ఫ్రాంచైజీ లీగ్స్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముప్పు పొంచి ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. 'టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచివే. కానీ అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కంటే వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుంది'అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ సైమన్ డౌల్ సైతం ఆర్చర్ తీరును తప్పుబట్టాడు. డబ్బుల కోసం దేశం తరఫున జరిగే మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం సరికాదని విమర్శించాడు. గతంలో ట్రెంట్ బౌల్ట్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సమయాల్లోనూ టెస్ట్‌ల కోసం సిద్ధమయ్యేవారని గుర్తు చేశాడు. ఈ మాజీ ఆటగాళ్ల విమర్శలను సునీల్ గవాస్కర్ ఖండించారు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించడం కొందరు విదేశీ ఆటగాళ్లకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు ఇచ్చే వేతనంలో 10 శాతం వాటాను బీసీసీఐ నేరుగా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు చెల్లిస్తోందని ఆయన గుర్తు చేశారు.

# వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభావంతుడు

**• సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్. ప్రశంసలు**

భారత క్రికెట్ రంగంలో సరికొత్త సంచలనం 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాడు. ఐపీఎల్ సీజన్ లో దాదాపు 800 పరుగులు సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకున్న ఆటగాడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. అతని అసాధారణ ప్రదర్శన చూసిన సెలక్టర్లు.. ఏరికోరి అతడిని భారత జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. దీని ద్వారా పురుషుల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే టీమిండియా పిలుపు అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్ర పుటల్లోకెక్కాడు. కేవలం ఐపీఎల్ మాత్రమే కాదు.. వైభవ్ సూర్యవంశీ వయసు విభాగాల క్రికెట్ లో, దేశీవాళీ (డొమెస్టిక్) సర్క్యూట్ లో, జూనియర్ అంతర్జాతీయ క్రికెట్ లోనూ రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. ఇటీవల భారత్ సాధించిన అండర్-19 ప్రపంచకప్ విజయంలోనూ అతను కీలక పాత్ర పోషించాడు. పరిమిత ఓవర్ల (లిమిటెడ్ ఓవర్స్) క్రికెట్ లో తన అపారమైన ప్రతిభను ఇప్పటికే నిరూపించుకున్న ఈ యువ సంచలనం..



భవిష్యత్తులో రెడ్-బాల్ (టెస్ట్) క్రికెట్ లో కూడా ఇదే రీతిన రాణించగలడా అసలు అతనికి టెస్ట్ క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉందా అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ బ్యాటర్‌గా పేరొందిన సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్.. వైభవ్ సూర్యవంశీని "అద్భుతమైన ప్రతిభావంతుడు" అని కొనియాడారు. అయితే అతను టెస్ట్ క్రికెట్ వైపు అడుగులు వేస్తాడా లేదా అనేదానిపై ఆదివారం ఒక ఇంటర్వ్యూలో డివిలియర్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు."అవును, అతను అద్భుతమైన టాలెంట్. కానీ రెడ్-బాల్ క్రికెట్ గురించి నేను కచ్చితంగా సమాధానం చెప్పలేను. అతను అనుకుంటే టెస్ట్ క్రికెట్ ఆడగలడు, కానీ ఇక్కడే పెద్ద ప్రశ్న వస్తుంది.. అతనికి నిజంగానే టెస్ట్ క్రికెట్ ఆడాలని ఉందా దానికి కాలమే సమాధానం చెబుతుంది. అతనికి ఆ సామర్థ్యం, ప్రతిభ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే టెస్ట్ క్రికెట్ అంత సులువు కాదు, కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. నా అభిప్రాయం ప్రకారం అతను టెస్ట్ క్రికెట్ ఆడాలని నేను కోరుకుంటున్నాను, కానీ ఆడతాడా అనేది అనుమానమే. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం" అని డివిలియర్స్ వ్యాఖ్యానించారు. ఇంత చిన్న వయసులోనే వైభవ్‌కు భారత జట్టులో చోటు కల్పించాలనే సెలక్టర్ల నిర్ణయాన్ని డివిలియర్స్ పూర్తిగా సమర్థించారు. "సెలక్టర్లు ఖచ్చితంగా సరైన నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి ధైర్యమైన నిర్ణయం తీసుకున్నందుకు వారికి అభినందనలు. అతను ఇంకా చాలా చిన్నవాడని, అనుభవం లేదని పక్కన పెట్టడం చాలా సులువు. కానీ వైభవ్ తన ప్రతిభతో ఆ తలుపులు బద్దలు కొట్టాడు. భారత టీ20 జట్టులో స్థానానికి అతను పూర్తి అర్హుడు.

# మైదానంలో తీవ్ర వాగ్వాదం

**• ఇంగ్లిస్‌ను రెచ్చగొట్టిన నహిద్ రాణా**

ఢాకా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా, ఆసీస్ కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఇంగ్లిస్ (19) వికెట్ తీసిన రాణా, అతని ముందే రెచ్చగొట్టేలా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. అదే సమయంలో ఏదో అనడంతో ఇంగ్లిస్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ వెనక్కి తిరిగి గొడవకు దిగిన ఇంగ్లిస్‌ను బంగ్లాదేశ్ ఆటగాళు సముదాయించి పంపించారు.బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా మధ్య ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ఓ ఆసక్తికర ఘటన జరిగింది. ఈ మ్యాచులో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా , ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో జోష్ ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత వివాదం చెలరేగింది. నహిద్ రాణా సెలబ్రేషన్స్ ఇంగ్లిస్‌కు కోపం తెప్పించాయి. దీంతో మైదానంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు బంగ్లాదేశ్ ప్లేయర్లు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. 284/8 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తొలి 8 బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. ఆదుకునే



ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్.. 51/2తో నిలిచింది. అప్పటికే ఇంగ్లిస్ 19 రన్స్ చేశాడు. అయితే 11వ ఓవర్ వేసేందుకు నహిద్ రాణా వచ్చాడు. స్ట్రైకింగ్‌లో ఇంగ్లిస్ ఉన్నాడు. రాణా వేసిన బంతిని షాట్ ఆడబోయిన ఇంగ్లిస్.. వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. బ్యాట్ బంతిని తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ చేతిలో పడటంతో ఔట్ అయ్యాడు. దీంతో నహిద్.. సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇంగ్లిస్ ముందే తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత నహిద్.. ఏదో అనగా ఇంగ్లిస్ కోపోద్రిక్తుడైపోయాడు.

# ఒలింపిక్స్‌లో కోహ్లీని ఆడించాలి..

**• టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్**

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లీని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లీ క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది. తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. 'మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లీ తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు.విరాట్



కోహ్లీకి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను'అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం అంతర్జాతీయ టీ20లకు విరాట్ కోహ్లీ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభవ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేం దుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకు న్నాడు. అంత ర్జాతీయ క్రికెట్‌లో కూడా వైభవ్ సత్తా చాటితే ఒలింపిక్స్ జట్టులో ఉంటాడు. 1900 సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/ సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్‌లను కూడా చేర్చారు.

# గంభీర్‌ను బైపాస్ చేసిన ఆటగాళ్లు!



వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ కోసం టీమ్‌ఇండియా ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోంది. భారత్- అఫ్ఘానిస్థాన్ వన్డే సిరీస్‌తోనే ఈ సన్నాహాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఈ లోపే భారత్ జట్టులో సర్దుబాటు చేయాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్‌పై చర్చలు జోరుగా నడుస్తున్నాయి. వాళ్లు వచ్చే వన్డే ప్రపంచ కప్ వరకు ఉంటారా లేదా అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. టెస్టులు, టీ20 ఫార్మాట్లలో అత్యంత పట్టున్న వ్యూహకర్తగా గౌతమ్ గంభీర్ పేరుతెచ్చుకున్నాడు. కానీ వన్డే క్రికెట్‌కు సంబంధించి ఆ స్థాయి పట్టు అతడు సంపాదించలేకపోయాడని టాక్. ముఖ్యంగా వన్డే టీమ్‌లోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ ఆటగాళ్లతో గంభీర్‌కు సరైన సమన్వయం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే జట్టులోని ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు గంభీర్‌ను పక్కన పెట్టి (బైపాస్ చేసి) 2027 వన్డే ప్రపంచకప్ నాటికి తమ భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంపై స్పష్టత కోసం నేరుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పెద్దలను ఆశ్రయించినట్లు సమాచారం.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్ అయినప్పటి నుంచి, వాళ్లిద్దరూ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా లేదా వారి భవిష్యత్ ప్లాన్స్ ఏంటి అనే అంశాలు తెరపైకి వచ్చాయి. అయితే గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న విధానాలు, అలాగే సెలక్షన్ కమిటీ డిమాండ్లు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆడిన విరాట్ కోహ్లీ ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. తాను మంచి క్రికెటర్ అని మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పాడు. ఇక రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడు ఇప్పుడు వన్డే వరల్డ్ కప్ విషయంలో భిన్నమైన విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రముఖ వార్తాపత్రిక నివేదిక ప్రకారం, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీం మేనేజ్‌మెంట్‌కు, కొందరు సీనియర్ ఆటగాళ్లకు మధ్య పూర్తిస్థాయి అవగాహన కుదరలేదు. ప్రస్తుతానికి ఆ సీనియర్ ఆటగాళ్లు తమ భవిష్యత్తుపై నేరుగా బీసీసీఐ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పరిణామం అటు కోచ్ గంభీర్‌ను, ఇటు సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్‌ను ఇరకాటంలో పడేసింది. "జట్టులో విరాట్, రోహిత్ లాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నప్పుడు, డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు మరింత బలమైన పట్టు ఉండాలి.

# 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై అడుగుపెట్టనున్న టీమిండియా..




భారత క్రికెట్ అభిమానులకు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీమిండియా సుదీర్ఘ విరామం తర్వాత పొరుగు దేశమైన శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 9 సంవత్సరాల తర్వాత భారత జట్టు లంక గడ్డపై వైట్ జెర్సీతో బరిలోకి దిగబోతుండటం విశేషం. చివరిసారిగా 2017లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడింది. అప్పట్లో లంకను వారి సొంత గడ్డపైనే క్లీన్ స్వీప్ చేసి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత టీమిండియా అక్కడ అడుగుపెడుతుండటంతో ఈ టూర్ ఫుల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. భారత్, శ్రీలంక మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆగస్టు 15న ఘనంగా ప్రారంభం కానుంది. సరిగ్గా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు జరుగుతుంది. ఆ తర్వాత కొద్దిరోజుల గ్యాప్‌తో ఆగస్టు 23 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

అయితే, ఈ రెండో మ్యాచ్ జరగబోయే వేదికపై లంక బోర్డు ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, సెంట్రల్ కొలంబోలోని ప్రసిద్ధ సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.శ్రీలంకతో జరగబోయే ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కేవలం ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు. ఇది ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగబోతోంది. కాబట్టి ఫైనల్ రేసులో నిలవాలంటే రెండు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఇప్పటివరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి కానీ ఈ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. కానీ అంతర్గత సమాచారం ప్రకారం ఈ తేదీలు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడబోతుండటం గమనార్హం.

ఈ పర్యటనలో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, అభిమానులను అలరించడానికి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా హింట్ ఇచ్చారు. లంక బోర్డు నుంచి అదనంగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సిందిగా తమకు అభ్యర్థన వచ్చిందని ఆయన మీడియాకు వెల్లడించారు. దీనిపై బీసీసీఐ సానుకూలంగానే ఉందని, త్వరలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలతో కూడిన పూర్తి అధికారిక షెడ్యూల్‌ను ఇరు దేశాల బోర్డులు సంయుక్తంగా విడుదల చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

## పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట



ప్రకృతిని ప్రేమించడం.. అనుభవించడం.. ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాని ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు



ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతలకు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు..

### తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన అసమాన సేవలకు, ఆయన స్థాయికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. భారతీరాజాకు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలంటూ తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.



అంతకుముందు టీఎఫ్ఏపీఏ ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ, తమ వ్యవస్థాపకుడైన భారతీరాజాకు ప్రభుత్వ గౌరవం కల్పించాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పట్ల నిర్మాతల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ఈ సందర్భంగా టీఎఫ్ఏపీఏ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు భారతీరాజా అని కొనియాడింది. ఒక దర్శకుడిగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను రూపొందించడమే కాకుండా, నటుడిగానూ తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు అందుకొని సినిమాకు గర్వకారణంగా నిలిచారని గుర్తుచేసింది.

2020లో నిర్మాతల సంక్షేమం కోసం భారతీరాజా ముందుండి 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్'ను స్థాపించారని, ఆయన నాయకత్వ పటిమతోనే ఈ సంఘం నేడు 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలతో బలంగా ఉందని అసోసియేషన్ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటీనటుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని, తమిళ సినిమా అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

## దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

### చిత్ర వర్గాల్లో బలమైన టాక్



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.

## తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ

### బాలకృష్ణ జన్మదినోత్సవం


### అభినందనలు తెలిపిన ప్రముఖులు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటప్రస్థానం ఒక అద్భుతం. ఆయన జన్మదినం సందర్భంగా చిత్ర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న బాలయ్య కెరీర్‌లో ఎన్నెన్నో అపూర్వ విజయాలు, మరెవరికీ సాధ్యంకాని రికార్డులు. వసూళ్ల పరంగానే కాదు, థియేటర్లలో అత్యధిక రోజులు ప్రదర్శించబడిన సినిమా కూడా బాలయ్య పేరుతోనే ఉంది. బాలకృష్ణ పని అయిపోయింది అని విమర్శకులు భావించిన ప్రతిసారీ మాస్ కంబ్యాక్ ఇవ్వడమే కాదు బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో విమర్శకుల నోళ్లు మూయించాడు. మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదవ కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నేర్పిన అపారమైన వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ, తల్లి బసవరామతారకం అందించిన ప్రేమానురాగాలు బాలయ్యను ఒక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఓవైపు బడిలో పాఠాలు చదువుకుంటూనే 1974లో ఎన్టీఆర్ నటించిన తాతమ్మకల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యాడు బాలయ్య. అన్నదమ్ముల అనుబంధం, వేములవాడ భీమకవి, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వము, శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం, రౌడీరాముడు-కొంటె కృష్ణుడు, అనురాగదేవత, సింహం నవ్వింది, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' వంటి చిత్రాలలో తండ్రి ఎన్టీఆర్ తో కలిసి నటించి మెప్పించాడు బాలయ్య. 1984లో సాహసమే జీవితం సినిమాతో సోలో హీరోగా మారారు. కానీ ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. తొలిమూడు సినిమాలు ఫ్లాప్ అవడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి.

## కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

### రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## ఆల్ఫా టీజర్ విడుదల

### భారీ యాక్షన్ సీన్లలో కొత్తగా ఆలియా భట్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌÷ట్లు,్గ÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది.మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888